

ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి

9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts


సంపుటి - 03 సంచిక -172 పేజీలు - 8 వెల ₹03/- బుధవారం 30 సెప్టెంబర్ 2026

వైసీపీ ఐదేళ్ల కంటే.. ఈ రెండేళ్లలోనే

పదింతల రోడ్ల నిర్మాణం

- పల్లె పండుగ 1.0, 2.0తో రూ.9 వేల కోట్ల అభివృద్ధి పనులు
- 100 రెట్లు ఎక్కువగా మినీ గోకులాలు
- ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో 6,500 కి.మీ. సీసీ రోడ్ల నిర్మాణం
- అడవి తల్లిబాటలో 1,500 కి.మీ.కు పైగా రహదారుల నిర్మాణం
- గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పల్లె పండుగ 3.0
- పల్లె పండుగ 3.0లో 6 వేల కి.మీ. సీసీ రోడ్లు, 9,500 కి.మీ. బీటీ రోడ్లు
- 22,500 మినీ గోకులాలు.. 50 వేల ఎకరాల్లో పండ్ల తోటలు





ఉదయగిరిసెప్టెంబర్ 29 (రిపబ్లిక్ న్యూస్) ఉదయగిరి వేదికగా రూ.11,085 కోట్ల పల్లెపండుగ 3.0కు శ్రీకారం చుట్టింది ప్రభుత్వం. ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి పనులు ప్రారంభించారు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్. 'పల్లెల అభివృద్ధే రాష్ట్ర ప్రగతికి పునాది. ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపడేలా, ప్రతి గ్రామం స్వయం సమృద్ధి సాధించేలా సమగ్ర అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రహదారులు, తాగు నీరు, వ్యవసాయం, ఉపాధి, పరిశుభ్రత, మౌలిక వసతులతోపాటు పర్యాటక రంగానికీ ప్రాధాన్యం ఇస్తూ గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మార్చే లక్ష్యంతో 'పల్లె పండుగ 3.0'కు శ్రీకారం చుట్టామ'ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. పల్లె బలపడితేనే రాష్ట్ర భవిష్యత్తు బలపడుతుందనే సంకల్పంతో ప్రతి పల్లెను అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. మిగతా2లో...



మయన్మార్‌లో

వైమానిక దాడి..

- అరాకన్ ఆర్మీ ప్రాంతంలో సైన్యంపై దాడి
- 49 మంది మృతి, 58 మందికి గాయాలు

మయన్మార్,సెప్టెంబర్ 29 (రిపబ్లిక్ న్యూస్) మయన్మార్ పశ్చిమ రఖైన్ రాష్ట్రంలో, తిరుగుబాటుదారుల బృందమైన అరాకన్ ఆర్మీ నియంత్రణలో ఉన్న ప్రాంతంలో సైన్యం జరిపిన వైమానిక దాడిలో కనీసం 49 మంది మరణించగా, 58 మంది గాయపడ్డారు. అరాకన్ ఆర్మీ, సహాయక చర్యలలో పాల్గొన్న ఒక అధికారి ప్రకారం, సోమవారం క్యౌక్తావ్ టౌన్‌షిప్‌లోని ఒక స్థానిక మార్కెట్ సమీపంలో ఒక యుద్ధ విమానం రెండు బాంబులను జారవిడిచింది. మృతులలో మార్కెట్ వ్యాపారులు, సరుకులు కొనడానికి వచ్చిన వినియోగదారులు, రోడ్డుపై నడుస్తున్న సాధారణ ప్రజలు ఉన్నారని చెబుతున్నారు. గాయపడిన వారిలో 22 మంది పరిస్థితి విషమంగా ఉందని అరాకన్ ఆర్మీ పేర్కొంది. ఘటనా స్థలంలోని సహాయక సిబ్బంది నుండి అందిన సమాచారం ఆధారంగా, రఖైన్‌లో సహాయక చర్యలలో పాల్గొంటున్న సీనియర్ అధికారి వాయ్ హ్టూన్ ఆంగ్ మృతుల సంఖ్యను మిగతా2లో...

పల్లె పండుగ 3.0తో గ్రామాల

రూపురేఖలు మారతాయి

- రూ.11,085 కోట్లతో గ్రామీణాభివృద్ధి పనులకు శ్రీకారం: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



నెల్లూరు,సెప్టెంబర్ 29 (రిపబ్లిక్ న్యూస్)'పల్లె పండుగ 3.0' కార్యక్రమంతో రాష్ట్రంలోని గ్రామాల రూపురేఖలు మారుతాయని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలం రామాపురంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి ఆయన పల్లె పండుగ 3.0 కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రూ.11,085 కోట్లతో చేపట్టనున్న గ్రామీణాభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.గత రెండేళ్లలో మిగతా2లో...



అప్పుడు చెబితే నమ్మలేదు..

ఇప్పుడు అర్థమైంది

ఓట్ల చోరీ అంశంపై కాంగ్రెస్ నేతలకు రాహుల్ గాంధీ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 29 (రిపబ్లిక్ న్యూస్)ఓట్ల చోరీ, ఓటర్ల జాబితా సవరణ అంశాలపై గత రెండేళ్లుగా తాను మాట్లాడుతున్నప్పటికీ పార్టీలోని కొందరు మిగతా2లో...

అమెరికాలో ఎస్సార్

భారీ ఉక్కు పరిశ్రమ

రూ.15 బిలియన్ డాలర్లతో ఐవాలో ప్లాంట్.. మొత్తం పెట్టుబడి 18 బిలియన్ డాలర్లు





సీడబ్ల్యూసీకి ముందు

కీలక నేతలతో రేవంత్ భేటీ

- రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్, డీకే శివకుమార్‌తో చర్చలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 29 (రిపబ్లిక్ న్యూస్)కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశానికి ముందు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్టీకి చెందిన కీలక నేతలతో సమావేశమయ్యారు. రాహుల్‌గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో ఆయన చర్చలు జరిపినట్లు రేవంత్‌రెడ్డి

ఎన్‌సీపీసీఆర్ తీరుపై

సుప్రీంకోర్టు అసంతృప్తి

- ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఆర్‌టీఈ కోటా అమలుపై ఆగ్రహం







నాతో పెట్టుకోవద్దు

- కేటీఆర్ వ్యాఖ్యలపై కవిత తీవ్ర ఆగ్రహం


హైదరాబాద్,సెప్టెంబర్ 29 (రిపబ్లిక్ న్యూస్) తాను ఏ విషయమైనా నిర్దిష్టమైన ఆధారాలతోనే మాట్లాడుతానని, తనతో పెట్టుకోవద్దని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. తాను ఎవరి మాటలు విని ఏది పడితే అది మాట్లాడబోనని స్పష్టం చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తీవ్ర స్థాయిలో స్పందించారు.అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి పార్టీ అధినేత కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలే కారణమన్న

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

వైసీపీ ఐదేళ్ల కంటే.. ఈ రెండేళ్లలోనే పదింతల రోడ్ల నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరిలో పల్లెపండుగ 3.0 కార్యక్రమం ద్వారా 11,085 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు తో కలసి పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "ఈ రెండున్నరేళ్లలో పల్లెపండుగ, జలజీవన్ మిషన్ – అమరజీవి జలధార, 15వ ఆర్థిక సంఘం నిధుల సద్వినియోగం, 10 వేలకుపైగా పదోన్నతులు, డి.డి.ఒ. కార్యాలయాల ఏర్పాటు.. ఇలా ఎన్నో సంస్కరణలతో ఒకవైపు గ్రామాల అభివృద్ధికి బాటలు వేస్తూనే, మరోవైపు వ్యవస్థను బలోపేతం చేశాం. ఒకప్పుడు పంచాయతీలు బ్లీచింగ్ పౌడర్ కూడా కొనలేని పరిస్థితి నుంచి, ఇప్పుడు తమ గ్రామానికి అవసరమైన పనులను తామే నిర్ణయించుకుని, తమ గ్రామ అభివృద్ధికి తామే ప్రణాళికలు రూపొందించుకునే స్థాయికి పంచాయతీ రాజ్ వ్యవస్థను తీసుకొచ్చాం.**గత ఐదేళ్ల కంటే రెండేళ్లలోనే పదింతల రోడ్ల నిర్మాణం**గత ప్రభుత్వం ఐదేళ్లలో 880 కి.మీ. సీసీ రోడ్లు నిర్మిస్తే, కూటమి ప్రభుత్వం ద్వారా కేవలం రెండేళ్లలోనే దానికి 10 రెట్లు ఎక్కువగా, దాదాపు 9,000 కి.మీ. సీసీ రోడ్లను పూర్తి చేశాం. గతంలో 304 మినీ గోకులాలు మాత్రమే నిర్మిస్తే, మనం దాదాపు 100 రెట్లు ఎక్కువగా, 30 వేలకు పైగా మినీ గోకులాలను నిర్మించాం. అలాగే, పల్లెపండుగ ద్వారా 13,326 గ్రామ పంచాయతీల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాం. ఇందులో భాగంగా 1 లక్ష 15 వేల పంట కుంటలను నిర్మించడంతోపాటు, 2 లక్షల ఎకరాల్లో పండ్ల తోటలను అభివృద్ధి చేశాం. మరోవైపు, 10 వేల కిలోమీటర్ల బీటీ రోడ్ల పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి. మన కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, ఇతర కాలనీల్లో 6,500 కిలోమీటర్ల సీసీ రోడ్లను ఇప్పటికే పూర్తి చేసింది. గిరిజన గ్రామాలకు రహదారి అనుసంధానాన్ని మరింత మెరుగుపరచేందుకు అడవితల్లిబాట కార్యక్రమం కింద రూ.2,180 కోట్ల వ్యయంతో సుమారు 2,437 కిలోమీటర్ల రహదారులను నిర్మించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. ఇందులో ఇప్పటికే 1500 కిలోమీటర్లకు పైగా అనుసంధాన రహదారులను నిర్మించాం. అలాగే, ఇప్పటివరకు రోడ్డు అనుసంధానం లేని బంజారా, యానాది, ఎరుకుల గిరిజన ఆవాసాలు



ఉన్న ప్రాంతాల్లో, పల్లెపండుగ ద్వారా 167 ఆవాసాలకు 111.4 కి.మీ. మేర రహదారి సౌకర్యం కల్పించాం.**పల్లెపండుగ 3.0తో గ్రామీణ ప్రగతికి కొత్త ఊపు**ఈ రోజు ఇక్కడ మనం రాష్ట్ర చరిత్రలో గతంలో ఏ ప్రభుత్వం చేయలేని విధంగా, గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో, ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయకత్వంలో, ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామీణ అభివృద్ధిని పెద్ద ఎత్తున ముందుకు తీసుకెళ్లబోతున్నాం. రూ.50 వేల కోట్లతో పల్లెపండుగ, జల జీవన్ మిషన్ – అమరజీవి జలధార వంటి కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయబోతున్నాం. ఇందులో రూ.30 వేల కోట్లతో అక్టోబర్ 5న గౌరవ ముఖ్యమంత్రివర్యులతో కలిసి జల జీవన్ మిషన్ – అమరజీవి జలధార కార్యక్రమం ద్వారా మల్టీ విలేజ్ స్కీమ్, సింగిల్ విలేజ్ స్కీమ్ పనులకు శంకుస్థాపనలు చేయబోతున్నాం. అలాగే రూ.9 వేల కోట్లతో పల్లెపండుగ 1.0, 2.0 కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసి, ఈ రోజు రూ.11,085 కోట్లతో ప్రతిష్టాత్మకంగా పల్లెపండుగ 3.0ను ప్రారంభిస్తున్నాం. ఇందులో భాగంగా 6 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు, 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్లు, మరో 22,500 మినీ గోకులాలు, 50 వేల ఎకరాల్లో పండ్ల తోటలను అభివృద్ధి చేయబోతున్నాం. అలాగే, 1,000 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రెయిన్లు, బస్ షెల్టర్లు, గ్రామ పంచాయతీ భవనాలు, రచ్చబండలు తదితర అభివృద్ధి పనులను చేపట్టబోతున్నాం. **పైలెట్ ప్రాజెక్ట్ గా డొంక రోడ్ల అభివృద్ధి** ఎన్నో ఏళ్లుగా రైతులు తమ పంటలను మార్కెట్‌కు తరలించేందుకు డొంక రోడ్ల వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ముందుగా పైలెట్ ప్రాజెక్ట్‌గా ప్రతి నియోజకవర్గంలో ఒక డొంక రోడ్డును అభివృద్ధి చేయబోతున్నాం. ఆ తర్వాత 161 గ్రామీణ నియోజకవర్గాల్లో డొంక రోడ్లకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి, రైతులు తమ పంటలను సులభంగా మార్కెట్‌కు తీసుకెళ్లేలా రహదారి సౌకర్యాన్ని మెరుగుపరచబోతున్నాం. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోనే దాదాపు రూ.520 కోట్లతో పల్లెపండుగ పనులు చేపట్టాం. ఇంకా మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టబోతున్నాం. మన ఉదయగిరిలోనే పల్లెపండుగ ద్వారా రూ.121 కోట్లతో 115 కి.మీ. మేర సీసీ, బీటీ రోడ్లు, 1,200కు పైగా నీటి కుంటలు, 348 గోకులాలు, 190కి పైగా నీటి తొట్లు, సుమారు 900 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు వంటి అభివృద్ధి పనులను పూర్తి చేశాం. ఉదయగిరి నియోజకవర్గంలోని ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా, గతంలో నిలిచిపోయిన సుజల శ్రవంతి పథకం ద్వారా రూ.52 కోట్లతో, దుత్తలూరు, జలదంకి, కలిగిరి, కొండాపురం, సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, వింజమూరు మండలాల్లో 381 పనులు చేపట్టబోతున్నాం. ఉదయగిరి కోటకు చేరుకునే మార్గంలో సుమారు 4 కి.మీ. రహదారిని రూ.2.5 కోట్లతో మంజూరు చేస్తున్నాం. దీనికి అవసరమైన అటవీ శాఖ అనుమతులను త్వరగా పొందేలా అధికారులతో సమన్వయం చేసుకోవాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశిస్తున్నాను. **ప్రజల భాగస్వామ్యంతో ప్రగతి సాధ్యం** అభివృద్ధి పనుల్లో ప్రభుత్వంతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా చాలా ముఖ్యం. మన గ్రామంలో జరుగుతున్న ప్రతి అభివృద్ధి పనిని ప్రజలు తమ పనిగా భావించి, దాని పురోగతిని గమనించాలి. కాంట్రాక్టర్ పనులు నాణ్యతగా చేస్తున్నారా? నిబంధనల ప్రకారం పనులు జరుగుతున్నాయా? అనే విషయాలను ప్రజలు పరిశీలించాలి. ఎక్కడైనా అనుమానం వచ్చినా, నాణ్యతలో లోపం కనిపించినా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పొంగూరు నారాయణ, ఎన్.ఎం.డి. ఫరూక్, నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, బి.సి. జనార్ధన్ రెడ్డి, నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ డాక్టర్ పి. కృష్ణయ్య, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, కమిషనర్ కృష్ణతేజ, జిల్లా కలెక్టర్ శ్రీ హిమాన్షు శుక్లా, కూటమి పార్టీలకు చెందిన శాసన మండలి, శాసనసభ్యులు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు పాల్గొన్నారు.

అమెరికాలో ఎస్సార్ భారీ ఉక్కు పరిశ్రమ

వాషింగ్టన్, సెప్టెంబర్ 29 (రిపబ్లిక్ న్యూస్) భారతదేశానికి చెందిన ఎస్సార్ గ్రూప్ అమెరికాలో భారీ ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. ఎస్సార్ గ్రూప్‌కు చెందిన మెసాబి మెటాలిక్స్ సంస్థ ఐవా రాష్ట్రంలో సుమారు 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో సమగ్ర ఉక్కు కర్మాగారాన్ని నిర్మించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ ప్రాజెక్టులో ఐవాలో ఉక్కు తయారీ సముదాయంతో పాటు మిన్నెసోటాలోని మెసాబి ఐరన్ రేంజ్‌లో ఇనుప ఖనిజ గని, పెల్లెటైజింగ్ కేంద్రం ఉన్నాయి. మిన్నెసోటా గనిపై ఇప్పటికే దాదాపు 3 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టినట్లు సంస్థ తెలిపింది. దీంతో మొత్తం పెట్టుబడి సుమారు 18 బిలియన్ డాలర్లకు చేరనుంది. ఐవాలోని ప్లాంట్ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత ఏటా సుమారు 10 మిలియన్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2030 నాటికి ఉత్పత్తి ప్రారంభించేలా ప్రణాళిక రూపొందించినట్లు కంపెనీ, అమెరికా అధికారులు వెల్లడించారు. నిర్మాణ దశలో 8 వేలకుపైగా ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉందని ఎస్సార్ గ్రూప్ తెలిపింది. ప్లాంట్ కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత కనీసం 1,750 మంది పూర్తిస్థాయి ఉద్యోగులు పనిచేయనున్నట్లు పేర్కొంది.

ఈ పెట్టుబడి నిర్మాణ కాలంతో పాటు ప్రారంభ కార్యకలాపాల తొలి పదేళ్లలో సుమారు 95 బిలియన్ డాలర్ల ఆర్థిక ఉత్పత్తికి దోహదం చేస్తుందని కంపెనీ అంచనా వేసింది. మిన్నెసోటాలోని గని నుంచి లభించే ఇనుప ఖనిజాన్ని ఐవా ప్లాంట్‌కు తరలించి ఉక్కు తయారీలో వినియోగించనున్నారు. ఈ విధంగా గనుల నుంచి ఉక్కు తయారీ వరకు అమెరికాలోనే పూర్తయ్యే సమగ్ర సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేయాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో డైరెక్ట్ రిడ్యూస్డ్ ఐరన్ (డీఆర్ఐ), ఎలక్ట్రిక్ ఆర్క్ ఫర్నేస్ (ఈఏఎఫ్) విధానాలను ఉపయోగించనున్నట్లు ఎస్సార్ గ్రూప్ వెల్లడించింది.

సంప్రదాయ బ్లాస్ట్ ఫర్నేస్ విధానాలతో పోలిస్తే ఇంధన వినియోగం, ఉద్గారాలను తగ్గించే లక్ష్యంతో ఈ సాంకేతికతను వినియోగించనున్నట్లు తెలిపింది. వైట్‌హౌస్‌లో జరిగిన ప్రకటన కార్యక్రమంలో ఎస్సార్ గ్రూప్ వ్యవస్థాపకుడు, వైస్ చైర్మన్ రవి రుయా, మెసాబి మెటాలిక్స్ చైర్మన్ రేవంత్ రుయా పాల్గొన్నారు. అమెరికాలో ఉక్కు తయారీ సామర్థ్యాన్ని పెంచడం, స్థానిక ఉపాధి అవకాశాలను విస్తరించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యాల్లో భాగంగా ఉన్నాయని సంస్థ పేర్కొంది.

ఎన్‌సీపీసీఆర్ తీరుపై సుప్రీంకోర్టు అసంతృప్తి

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 29 (రిపబ్లిక్ న్యూస్) ప్రైవేటు పాఠశాలల్లో పేద, బలహీన వర్గాల పిల్లలకు ఉచిత విద్య అందించేందుకు ఉద్దేశించిన 25 శాతం ఆర్‌టీఈ కోటా అమలుపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ కోటా అమలుకు సంబంధించిన వివరాలను సమర్పించే విషయంలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) వ్యవహరించిన తీరుపై ధర్మాసనం ప్రశ్నలు లేవనెత్తింది. విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 12(1)(సీ) ప్రకారం ప్రైవేటు, ఎయిడెడ్ కాని పొరుగు పాఠశాలలు ప్రవేశ స్థాయిలో కనీసం 25 శాతం సీట్లను బలహీన, వెనుకబడిన వర్గాల పిల్లలకు కేటాయించి ఉచిత ప్రాథమిక విద్య అందించాలి. ఈ నిబంధన సమర్థంగా అమలవుతున్న తీరును సుప్రీంకోర్టు పర్యవేక్షిస్తోంది. ఈ కేసు విచారణ సందర్భంగా ఎన్‌సీపీసీఆర్ సమర్పించిన అఫిడవిట్‌పై జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. కేవలం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి సమాచారాన్ని సేకరించడం మాత్రమే ఎన్‌సీపీసీఆర్ బాధ్యత కాదని, ప్రతి పొరుగు పాఠశాలలో ఆర్‌టీఈ నిబంధన అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత కూడా ఉందని కోర్టు స్పష్టం చేసింది. ఎన్‌సీపీసీఆర్ తన అఫిడవిట్‌లో దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు లేఖలు రాసి ఆర్‌టీఈ చట్టంలోని సెక్షన్ 12(1)(సీ) అమలుకు సంబంధించిన నిబం ధనల వివరాలను కోరినట్లు తెలిపింది. అయితే తొమ్మిది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఇంకా స్పందన రాలేదని వెల్లడించింది. మిగిలిన ప్రాంతాలు అమలు చర్యలు చేపట్టినట్లు పేర్కొంది. అయితే సమాచార సేకరణతో ప్రక్రియను ముగించకుండా, చట్టం ఉద్దేశాన్ని ఆచరణలోకి తీసుకురా వాలని సుప్రీంకోర్టు సూచించింది. ఈ అంశంపై తదుపరి విచారణకు ఎన్‌సీపీసీఆర్ చైర్‌పర్సన్, డైరెక్టర్ హాజరుకావాలని ధర్మాసనం ఆదేశించింది. ఇది ధిక్కరణ కేసు కాదని, కమిషన్‌కు అప్పగించిన బాధ్యతపై స్పష్టత కల్పించేందుకే హాజరు కావాలని కోర్టు పేర్కొంది. 2026 జనవరిలోనే సుప్రీంకోర్టు ఆర్‌టీఈ చట్టంలోని 25 శాతం కోటాను సమర్థంగా అమలు చేసేందుకు అవసరమైన నియమ నిబంధనలు రూపొందించాలని ఆదేశించింది. బలహీన, వెనుకబడిన వర్గాల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశం కల్పించడం జాతీయ స్థాయి బాధ్యతగా పేర్కొంది.

సీడబ్ల్యూసీకి ముందు కీలక నేతలతో రేవంత్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. ఈ భేటీలో తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన అంశాలతో పాటు దేశంలో నెలకొన్న పలు కీలక పరిణామాలపై చర్చించినట్లు సమాచారం. తెలంగాణ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అదే సమయంలో జాతీయ స్థాయిలో సామాజిక, ఆర్థిక అభివృద్ధికి అవసరమైన వ్యూహాలపైనా చర్చించినట్లు తెలిపారు. సీడబ్ల్యూసీ సమావేశంలో ఎన్నికల వ్యవస్థ, ఓటర్ల జాబితాల అంశాలు కూడా చర్చకు వచ్చినట్లు నివేదికలు వెల్లడించాయి. కాంగ్రెస్ నేతలు ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ అంశానికి ప్రాధాన్యం ఏర్పడింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన సీడబ్ల్యూసీ సమావేశానికి రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ, ప్రియాంకగాంధీ వాద్రా, కేసీ వేణుగోపాల్ తదితర సీనియర్ నేతలతో పాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు.

మయన్మార్‌లో వైమానిక దాడి..

(మొదటి పేజీ తరువాయి)

ధృవీకరించినట్లు అసోసియేటెడ్ ప్రెస్ నివేదించింది. ఆ మార్కెట్ రాష్ట్రంలోని ప్రధాన టోకు వ్యాపార కేంద్రాలలో ఒకటి, ఇది వివిధ ప్రాంతాల నుండి వ్యాపారులను, వినియోగదారులను ఆకర్షిస్తుంది. తమ నియంత్రణలో ఉన్న ప్రాంతంలో జరిగిన ఈ ఘటనను ఒక తీవ్రమైన వైమానిక దాడిగా పేర్కొంటూ, బాధ్యులైన పక్షాలు, సంస్థలపై సమర్థవంతమైన ప్రతీకార చర్యలు తీసుకుంటామని అరాకన్ ఆర్మీ హెచ్చరించింది. దాడి తర్వాత సోషల్ మీడియాలో విడుదలైన ఫోటోలు, వీడియోలలో కొన్ని భవనాలు తగలబడుతుండటం, వాహనాలు దెబ్బతినడం, సమీపంలోని వంతెనలో కొంత భాగం ధ్వంసం కావడం కనిపించింది. ఈ ఘటనపై మయన్మార్ సైన్యం ఇంకా స్పందించలేదు. అయితే, తాము కేవలం చట్టబద్ధమైన సైనిక నిర్మాణాలనే లక్ష్యంగా చేసుకుంటామని సైన్యం గతంలో పేర్కొంది. తిరుగుబాటు గ్రూపులు ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపించింది. మయన్మార్‌లోని రెండవ అతిపెద్ద నగరమైన మాండలేకు పశ్చిమాన సుమారు 340 కిలోమీటర్ల దూరంలో క్యౌక్తావ్ ఉంది. ఈ ప్రాంతం ప్రస్తుతం అరాకన్ ఆర్మీ నియంత్రణలో ఉందని చెబుతున్నారు.

పల్లె పండుగ 3.0తో గ్రామాల రూపురేఖలు మారతాయి

(మొదటి పేజీ తరువాయి)

పల్లె పండుగ, జల్‌జీవన్ మిషన్ ద్వారా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని పవన్ కల్యాణ్ తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో రోడ్లు, మినీ గోకులాలు, ఫామ్ పాండ్స్ నిర్మించామని, మారుమూల తండాలకు సైతం రహదారి సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. అమరజీవి జలధార ద్వారా అనేక ప్రాంతాలకు తాగునీరు అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 161 గ్రామీణ నియోజకవర్గాల్లో డొంక రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు పవన్ కల్యాణ్ వెల్లడించారు. గ్రామీణాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, కేంద్రం సహకారంతో పల్లె పండుగ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. పంచాయతీరాజ్ శాఖను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.పల్లె పండుగ 3.0 కింద గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, పంచాయతీ భవనాలు, బస్ షెల్టర్లు, మినీ గోకులాలు, పశువుల తాగునీటి తొట్టెలు, వ్యవసాయ కుంటలు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వెల్లడైంది. గ్రామాల్లో ప్రాథమిక సౌకర్యాలను మెరుగుపరచడం, రైతులు, పాడి రైతులకు మద్దతు అందించడం కార్యక్రమం ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి.కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యమే దేశ ప్రగతికి పట్టుకొమ్మ అన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా గాంధీజీ కలలను సాకారం చేసే దిశగా అడుగులు పడుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయని తెలిపారు.కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పీవీఎన్ మాధవ్‌తో పాటు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అప్పుడు చెబితే నమ్మలేదు.. ఇప్పుడు అర్థమైంది

(మొదటి పేజీ తరువాయి)

నేతలు తన మాటలను అప్పట్లో అంగీకరించలేదని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పేర్కొన్నట్లు ఆంధ్రజ్యోతి కథనం తెలిపింది. మంగళవారం జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఆయన ఈ అంశంపై కీలక వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం.ఓట్ల చోరీ అంశాన్ని తాను గతంలోనే ప్రస్తావించానని, ఇప్పుడు పార్టీ నేతలు కూడా దాని ప్రాధాన్యతను అర్థం చేసుకున్నారని రాహుల్ చెప్పినట్లు సమాచారం. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పార్టీ నేతలకు సూచించినట్లు తెలుస్తోంది. అలాగే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు సంబంధించిన ప్రశ్నలను కూడా బహిరంగంగా ప్రస్తావించాలని రాహుల్ సూచించినట్లు ఆంధ్రజ్యోతి పేర్కొంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై కాంగ్రెస్‌లో చర్చ కొనసాగుతున్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.ఇటీవల ఢిల్లీలోని బేలా ఎస్టేట్‌లో ఓటర్ల పేర్ల తొలగింపుపైనా రాహుల్ గాంధీ ప్రశ్నలు లేవనెత్తారు. అక్కడ 728 మంది నివసిస్తుండగా, ఎస్ఐఆర్ అనంతరం ముసాయిదా ఓటర్ల జాబితాలో ఒక్కరి పేరు మాత్రమే మిగిలిందని, 727 మంది పేర్లు తొలగించారని ఆయన ఆరోపించారు. ఈ అంశాన్ని కూడా ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పార్టీ నేతలకు సూచించినట్లు సమాచారం.

నాతో పెట్టుకోవద్దు

(మొదటి పేజీ తరువాయి)

కేటీఆర్ వ్యాఖ్యలను కవిత తప్పుబట్టారు. అహంకారం, అక్రమ దందాలతోనే పార్టీని పాతాళానికి నెట్టారని కేటీఆర్‌ను ఉద్దేశించి విమర్శలు చేశారు.తాను పార్టీలోని ఓ నేతపై అవినీతి ఆరోపణలు చేస్తే కొన్ని గంటల్లోనే తనను పార్టీ నుంచి సస్పెండ్ చేశారని కవిత పేర్కొన్నారు. అదే వ్యక్తితో కలిసి ఉంటూ పార్టీ అధినేత నిర్ణయాలను బహిరంగంగా ప్రశ్నించడం పార్టీ వ్యతిరేక చర్య కాదా అని ఆమె ప్రశ్నించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని సంపాదించిన ఫామ్‌హౌస్‌లు, అనుమతులు, ఇతర వ్యవహారాలను ప్రస్తావిస్తూ కేటీఆర్‌పై విమర్శలు చేశారు.పార్టీలో జరిగిన వైఫల్యాలను అధినేత కేసీఆర్‌పై మోపడం సరికాదని కవిత అన్నారు. కేటీఆర్ మైండ్‌గేమ్‌ను నమ్ముతూ పార్టీకి నష్టం కలిగించవద్దని హెచ్చరించారు. గతంలో ప్రజలు, రైతులు ఎదుర్కొన్న సందర్భాలను ప్రస్తావిస్తూ కేటీఆర్ వ్యవహారశైలిపై ఆమె విమర్శలు చేశారు.

నేడు సిరిసిల్లకు సీఎం రేవంత్‌రెడ్డి

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు..

భారీ బహిరంగ సభలో ప్రసంగం



సిరిసిల్ల,మన జనప్రగతి సెప్టెంబర్ 29: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నేడు సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి హోదాలో సిరిసిల్లకు తొలిసారి వస్తున్న ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని, వివిధ పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. అనంతరం రగుడు బైపాస్ వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా తొలుత కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ భవన సముదాయాన్ని ప్రారంభించి, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారు. అనంతరం జిల్లా అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం సిరిసిల్లకు చేరుకోనున్న సీఎం రేవంత్‌రెడ్డి అంబేడ్కర్ చౌరస్తా నుంచి ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకుంటారు. అక్కడి నుంచి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతారు. అనంతరం రగుడు బైపాస్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తారు.సిరిసిల్ల పర్యటనలో సుమారు రూ.345.78 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టనున్నట్లు ఇతర నివేదికలు పేర్కొన్నాయి. నేతన్నల సంక్షేమం, మహిళా సాధికారత, విద్య, మౌలిక వసతులు తదితర అంశాలకు సంబంధించిన కార్యక్రమాలు ఇందులో ఉన్నాయి.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

15 వ అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా అంగన్వాడీ ఉత్సవాలు

పాల్గొన్న సూపర్ వైజర్ దస్తగిరమ్మ

ఆళ్లగడ్డ సెప్టెంబర్ 29 రిపబ్లిక్ న్యూస్

ఆళ్లగడ్డ పట్టణంలోని 15 వ అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ వర్కర్ జి. అరుణకుమారి అంగన్వాడీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 25 సంవత్సరాల ప్రజాసేవను పురస్కరించుకొని సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 7 వ తేదీ వరకు అంగన్వాడీ ఉత్సవాలు జరుపుతున్నాము.అందులో భాగంగా ఈ రోజు15 వ అంగన్వాడీ కేంద్రానికి సంబందించిన గర్భవతులు, బాలింతలు, పిల్లల తల్లులు, ఫ్రీ స్కూల్ పిల్లల తల్లులు అందరూ హాజరైనారు. ఈ అంగన్వాడీ ఉత్సవానికి ఐ సి డి యస్ ఆళ్లగడ్డ అర్బన్ సూపర్ వైజర్ దస్తగిరమ్మ హాజరై 3 సంవత్సరాలు నిండిన పిల్లల తల్లులను ఉద్దేశించి మాట్లాడుతూ. పిల్లలకు ఆట పాటల ద్వారా విద్యాబినయ గేయాలు, బొమ్మలకు రంగులు వేయడం లాంటి కార్యక్రమాలు అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల కోసం చేయించడం జరుగుతుందని. అంగన్వాడీ పిల్లలకు ప్రభుత్వం నుండి వచ్చే తెలుగు, ఇంగ్లీష్, లెక్కలు యాక్టివిటీ బుక్స్ ద్వారా అంగన్వాడీ కార్యకర్త పిల్లలకు బోదించడం జరుగుతుందని. అలాగే ఉదయం 10 గంటలకు పిల్లలకు గుడ్డు, 12 గంటలకు వేడి భోజనం, 3 గంటలకు పాలు అందిస్తామని కావున పిల్లల తల్లులు









తమ పిల్లలను కచ్చితంగా అంగన్వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు. 15 వ అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార ప్రత్యక్ష ప్రదర్శన, పోషక ఆహారం, గురించి, మాతృసంరక్షణ, టీకాలు, శిశుఅభివృద్ధి, మహిళా సాధికారత, స్వచ్ఛత, అంగన్వాడీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులకు పౌష్టికహారం, ఆకుకూరలు, కూరగాయలు, త్రునదాన్యాలు, పండ్లు యొక్క ప్రాధాన్యత గురించి వివరిస్తున్నారని తదితర అంశాలపై అంగన్వాడీ కేంద్రాల్లోఅందించే సేవల గురించి తల్లులకు సూపర్ వైజర్ దస్తగిరమ్మ వివరించారు.అనంతరం సూపర్ వైజర్ దస్తగిరమ్మ అంగన్వాడీ వర్కర్ జి. అరుణ కుమారి గర్భవతులను, పిల్లల తల్లులను సన్మానించారు. అనంతరం పిల్లల తల్లులు అంగన్వాడీ వర్కర్ ను హెల్పర్ ను సన్మానించారు. ఈ కార్యక్రమం లో అంగన్వాడీ హెల్పర్ విజయలక్ష్మి, ఆశా వర్కర్ పద్మ, గర్భవతులు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

మన భూమా మన ధీమా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ.



ఆళ్లగడ్డ సెప్టెంబర్ 29 రిపబ్లిక్ న్యూస్

ఆళ్లగడ్డ పట్టణం లోని 9వ వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ.

ఆళ్లగడ్డ పట్టణంలో నిర్వహిస్తున్న మన భూమా మన ధీమా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 9వ వార్డు కొత్త మసీదు ఏరియాలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా 9వ వార్డుకు చెందిన నూర్‌బాషా కుటుంబ సభ్యులు, ఆయన సోదరులు, మహబూబ్ బాషా , గౌస్ లాజం, జిలాన్ భాష, వసీం అక్రమ్, హాజీవ్ అలీ, అబ్దుల్, మహబూబ్ బి, రజియా, గౌసియా, మా భుచాన్ ,హసన్ , రసూల్ బి,మరో 10 కుటుంబాలకు చెందిన మొత్తం 40 మంది వైఎస్సార్‌సీపీని వీడి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు.పార్టీలో చేరిన వారందరికీ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం కల్పిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం, ఆళ్లగడ్డ పట్టణ అభివృద్ధి కోసం అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని ఆమెతెలిపారు.కార్యకర్తలను ఇబ్బంది పెట్టే సంస్కృతి మాది కాదు గతంలో 20142015 సమయంలో టీడీపీ కోసం పనిచేసిన



కార్యకర్తలపై బైండోవర్ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని కొంతమంది కార్యకర్తలు ఈరోజు నా దృష్టికి తీసుకొచ్చారు. గతంలో జరిగిన ఘటనల గురించి కూడా ప్రజలు, కార్యకర్తలు వివరించారు.కానీ ఈ రెండేళ్లలో మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆళ్లగడ్డలో ఎక్కడైనా రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడ్డామా ఎవరినైనా అనవసరంగా ఇబ్బంది పెట్టామా అనే విషయాన్ని ప్రజలు గమనించాలి.జెండా పట్టుకుని పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలను ఇబ్బంది పెట్టే సంస్కృతి మాది కాదు. మా పార్టీని నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం. ఆళ్లగడ్డలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అందరూ ప్రశాంతంగా జీవించాలన్నదే మా లక్ష్యం.ఆళ్లగడ్డ అభివృద్ధికి రూ.21 కోట్లుఆళ్లగడ్డ పట్టణ అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూ.21 కోట్ల నిధులు కేటాయించారు. పట్టణంలో రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా పనులు చేపడుతున్నాం.గతంలో పట్టణంలోని అనేక ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీల సమస్యలు ఉండేవి. ప్రస్తుతం అన్ని వార్డుల్లోనూ అభివృద్ధి పనులు చేపడుతున్నాం. పడకండ్ల ప్రాంతంలో డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతున్నాం. ములకలవాగు నీటిని తీసుకురావడం ద్వారా ప్రజలకు నీటి సౌకర్యం కల్పించేందుకు గతంలోనే చర్యలు తీసుకున్నాం.

ప్రజలు ఎక్కడైనా రోడ్డు కావాలని, డ్రైనేజీ కావాలని అడిగితేసమస్యనుపరిశీలించి పరిష్కరించేందుకు మా



ప్రభుత్వం సిద్ధంగా ఉంది. పట్టణంలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నాం.కులమతాలకు అతీతంగా అభివృద్ధి రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తోంది.కులం, మతం, ప్రాంతం అనే తేడాలు లేకుండా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోంది. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో కూడా అదే విధంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నాం.

గత ప్రభుత్వ హయాంలో జరగని అభివృద్ధి పనులు ప్రస్తుతం మా ప్రభుత్వంలో జరుగుతున్నాయి. ప్రజలు అభివృద్ధినిగమనిస్తున్నారు. కార్యకర్తలు కూడా అభివృద్ధి పనులను చూసి మా పార్టీలోకి వస్తున్నారు.

వైసీపీ నాయకులు, కిందిస్థాయి కార్యకర్తలు ఒక్కసారి ఆలోచించాలి. గతంలో మీ ప్రభుత్వం ఎందుకు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోలేకపోయింది? ఇప్పుడు మా ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి పనులు గతంలో ఎందుకు జరగలేదు?రాబోయే ఎన్నికల్లో పోటీ చేస్తామని వైసీపీ నాయకులు చెబుతున్నారు. ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగే ముందు గత ఐదేళ్ల పాలనపై ఆత్మపరిశీలన చేసుకోవాలి. ప్రజలు ఇచ్చే తీర్పును గౌరవించాలి.

మా బలం ప్రజాబలం. ప్రజల నమ్మకంతోనే మేము ముందుకు సాగుతున్నాం.అంటూ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు.

ఏపీ మోడల్ స్కూల్ నూతన పేరెంట్స్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ లకు శుభాకాంక్షలు తెలియజేసిన వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ టిఎన్ఆర్. నాగరాజు

పాములపాడు సెప్టెంబర్ 29 రిపబ్లిక్ న్యూస్:-మండల కేంద్రమైన పాములపాడులోని, ఏపీ మోడల్ స్కూల్ పేరెంట్స్ కమిటీ ఎన్నికలలో గెలుపొందిన చైర్మన్ గా మనోహర్, వైస్ చైర్మన్ శీలం.జయమ్మ లకు వైయస్ఆర్సీపీ మండల కన్వీనర్ టిఎన్ఆర్.నాగరాజు, నాయకులు టి.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ వి.నాగ రవీంద్ర లు ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నూతన చైర్మన్, వైస్ చైర్మన్ ల సంతకాలు చేయించుకొని, గెలుపొందిన డిక్లరేషన్ ఫారాలను ప్రిన్సిపాల్ వి.నాగ రవీంద్ర పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ టి.నాగరాజు, విద్యా కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ లతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, నందికొట్కూరు నియోజవర్గ సమన్వయకర్త ధారా సుధీర్ ఆదేశాల మేరకు ఏపీ మోడల్ స్కూల్ పేరెంట్స్ కమిటీ



చైర్మన్ గా మొలకసీమ. మనోహర్, వైస్ చైర్మన్ గా శీలం.జయమ్మ లను ఈరోజు జరిగిన ఎన్నికలలో గెలిపించుకోవడం జరిగిందని అన్నారు. మోడల్ స్కూల్ అభివృద్ధికి అందరితో కలిసి అన్ని రకాల సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. పాఠశాలలో విద్యార్థులకు గాని, తల్లిదండ్రులకు గాని ఎటువంటి సమస్యలు ఉన్న మా దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ కె.సాయి కృష్ణ, వైఎస్ఆర్సిపి నాయకులు హిదాయతుల్లా, లింగస్వామి, టి.రంగస్వామి, రవి, శీలం రవీంద్ర, చెలిమిల్ల గోపాల్, చికెన్ మక్బూల్, ఎర్రగుడూరు వెంకటేశ్వర్లు, నాగన్న, బానుముక్కల వెంకటేశ్వర్లు, మా భాష, ఆటో మక్బూల్, తదితర నాయకులు, కార్యకర్తలు, పాఠశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా పూర్తి

కర్నూలు జిల్లా వ్యాప్తంగా 1,391 పాఠశాలల్లో ఎస్ఎంసీ కమిటీలు ఏర్పాటు

కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 29)

జిల్లా వ్యాప్తంగా పాఠశాల విద్యా నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికల ప్రక్రియ నిర్వహించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు.

జిల్లాలోని మొత్తం 1,442 పాఠశాలల్లో 1,391 పాఠశాలలకు ఎస్ఎంసీ కమిటీలు ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అలాగే 51 పాఠశాలల్లో 50 శాతం కంటే తక్కువ ఎస్ఎంసీ సభ్యుల ఎన్నికల ప్రక్రియ పూర్తికావాల్సి ఉందని తెలిపారు.ప్రైవేటు పాఠశాలల్లోనూ పాఠశాల యాజమాన్య కమిటీలు



ఉండాలని ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు చర్యలు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని 792 పాఠశాలల్లో 81 పాఠశాలలకు ఎస్ఎంసీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాలల అభివృద్ధికి సంబంధించిన అంశాల్లో భాగస్వాములుగా ఉండేలా ఎస్ఎంసీ కమిటీల ఏర్పాటు జరిగిందని అధికారులు వివరించారు. తదుపరి ఉత్తర్వుల మేరకు మిగిలిన పాఠశాలల్లో కూడా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు.జిల్లా విద్యాశాఖ అధికారి, ఏపీ సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ డా. యన్.వి.కె.రాజు ఒక ప్రకటనలో ఈ వివరాలను వెల్లడించారు.

విద్యా కమిటీ చైర్మన్ లు టీ డి పి కైవసం



ఆళ్లగడ్డ సెప్టెంబర్ 29 రిపబ్లిక్ న్యూస్

ఆళ్లగడ్డ తాలూకా అహోబిలం గ్రామం లోని విద్యా కమిటీ చైర్మన్ లు అన్నీ తెలుగు దేశం పార్టీ కైవసం చేసుకుంది జిల్లా పరిషత్ హై స్కూల్ ఛైర్మెన్ గా డేగాని నరసింహ గౌడ్, మండల పరిషత్ స్కూల్ చైర్మన్ గా సానే శైలజ, గిరిజన ఆశ్రమ పాఠశాల చైర్మన్ గా ఇండ్ల పెద్దన్న ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఏ పి మోడల్ స్కూల్ చైర్మన్ గా దాసరి ఆదినారాయణ ను ఎన్నుకోవడం జరిగింది. తిప్పారెడ్డి పల్లె స్కూల్ చైర్మన్ గా మద్దూరు నాగేంద్ర ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోట కందుకూరు లో అన్నీ స్కూల్ చైర్మన్ లు తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుంది.

దిగుపల్లి పంచాయతీ పరిధిలో డిప్యూటీ ఎంపీడీవో తనిఖీలు


చౌడేపల్లి ప్రతినిధి సెప్టెంబర్ 29 రిపబ్లిక్ న్యూస్



మండలంలోని దిగుపల్లి గ్రామపంచాయతీలోని వ్యర్థాల నిర్వహణ షెడ్డును మంగళవారం డిప్యూటీ ఎంపీడీవో ఎస్.సి. గఫూర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. షెడ్డు నిర్వహణను పరిశీలించిన ఆయన, గ్రామ పరిశుభ్రతకు షెడ్డు అభివృద్ధికి సంబంధించి పలు కీలక సూచనలు చేస్తూ, వేగవంతమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా చెత్త వేరుచేసే (సెగ్రిగేషన్) ప్రక్రియపై గ్రీన్ అంబాసిడర్లకు పంచాయతీ కార్యదర్శి గోపి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం మరియు వాటిని శాస్త్రీయ పద్ధతుల్లో రకాలుగా విభజించడంపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో దిగుపల్లి గ్రామపంచాయతీకి చెందిన గ్రీన్ అంబాసిడర్లు పాల్గొని, గ్రామ పరిసరాల పరిశుభ్రతకు నిరంతరం కృషి చేస్తామని తెలియజేశారు.

విద్యా కమిటీ చైర్మన్‌గా బాలకృష్ణ

వైస్ చైర్మన్‌గా ధనలక్ష్మి ఏకగ్రీవ ఎన్నిక



గుత్తి, సెప్టెంబర్ 29: (రిపబ్లిక్ న్యూస్)

గుత్తి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో విద్యా కమిటీ ఎన్నికలను మంగళవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో విద్యా కమిటీ చైర్మన్‌గా బాలకృష్ణ, వైస్ చైర్మన్‌గా ధనలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం, మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేయడం, విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. విద్యా కమిటీ ద్వారా పాఠశాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా ఏకగ్రీవంగా ఎన్నికైన బాలకృష్ణ, ధనలక్ష్మిని పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎం.కె. చౌదరి, వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ ప్రతాప్, శ్రీనివాసులు, రమేష్, వేణు, రంగస్వామి, రవిచంద్ర, వెంకట్, శశి, రమేష్, సునీల్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన విద్యా కమిటీ ఎన్నికలు



చిప్పగిరి, సెప్టెంబర్, 29,(రిపబ్లిక్ న్యూస్) చిప్పగిరి మండలంలో మంగళవారం విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి మండలంలో మొత్తం 26 స్కూళ్లలో ఎలక్షన్స్ నిర్వహించగా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రక్రియ పూర్తి చేసి తల్లిదండ్రులు సమక్షంలో చైర్మన్, వైస్ చైర్మన్ ల ఎంపిక మరియు సమావేశం నిర్వహించి, కొన్ని ప్రాంతాల్లో ఏకగ్రీవంగా జరగగా, మరికొన్ని ప్రాంతాల్లో ఉత్కంఠ భరితంగా సాగాయి, కేజీబీవీ స్కూల్ నందు విద్యా కమిటీ చైర్మన్గా కేఎం. శివగంగా, వైస్ చైర్మన్ ఆరు సర్ల రామాంజనమ్మ, చిప్పగిరి జెడ్పీ హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్గా కత్రిమల రామాంజనేయులు, వైస్ చైర్మన్ గా కాకర్ల సురేంద్ర, కుందన గుర్తి విద్యా కమిటీ చైర్మన్గా కేసరి లలిత, వైస్ చైర్మన్ గా గుడిసె సునీతమ్మ, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు, మండలంలో పోలింగ్ కేంద్రాల వద్ద సజావుగా సాగేందుకు తల్లిదండ్రులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎస్ఐ సి. వెంకట నరసింహులు సిబ్బందితో కలిసి గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు, ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్ లకు మండల కన్వీనర్ పురుషోత్తం, మాజీ జెడ్పిటిసి మీనాక్షి నాయుడు, సొసైటీ చైర్మన్ కొండ రామాంజనేయులు, బోగేస్ స్వామి, జనార్దన్ స్వామి, పోతురాజు రాముడు, క్లస్టర్ ప్రభాకర్, కోనంకి శ్రీనివాసులు శుభాకాంక్షలు తెలిపారు.

రెచ్చిపోయిన చైన్ స్నాచర్లు

వివిధ ప్రాంతాలలో చోరీలు



అనంతపురం క్రైమ్,సెప్టెంబర్29,(రిపబ్లిక్ న్యూస్) నగరంలో పట్టపగలే చైన్ స్నాచర్లు రెచ్చిపోయారు. మహిళలను టార్గెట్ చేస్తూ దుండగులు రెచ్చిపోతుండటంతో నగరవాసుల్లో ఆందోళన నెలకొంది. సాయినగర్ ఆరో క్రాస్‌లో మంగళవారం ఉదయం 7.18 గంటల సమయంలో ఇద్దరు యువకులు పల్సర్ బైక్‌పై వచ్చి ఓ మహిళను వెంబడించి ఆమె మెడలోని మంగళసూత్రం చైన్‌ను లాక్కెళ్లారు. ఘటనతో స్థానికులు ఉలిక్కిపడ్డారు.సాయినగర్‌కు చెందిన శ్యామల జనరల్ స్టోర్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా వెనుక నుంచి పల్సర్‌పై వచ్చిన ఇద్దరు యువకులు ఆమెను అనుసరించి...అదను చూసి బైక్ వెనుక కూర్చున్న వ్యక్తి మహిళ మెడలోని చైన్‌ను ఒక్కసారిగా లాగడంతో ఆమె తేరుకునేలోపే దుండగులు బైక్‌పై వేగంగా అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో బాధితురాలు భయాందోళనకు గురై కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దోపిడీకి గురైన మంగళసూత్రం చైన్ సుమారు మూడున్నర తులాలు ఉన్నట్లు బాధితురాలు పోలీసులకు తెలిపినట్లు తెలిసింది.సమాచారం అందుకున్న వెంటనే డయల్100 సిబ్బంది ఘటనాస్థలికి చేరుకున్నారు. రెండో పట్టణ సీఐ పుల్లయ్య ఆధ్వర్యంలో పోలీసులు బాధితురాలి ఇంటి వద్ద, చైన్ స్నాచింగ్ జరిగిన ప్రాంతంలో వివరాలు సేకరించారు. ఇదిలా ఉండగా.. సమీపంలోని ఓ సీసీ కెమెరాలో చైన్ స్నాచింగ్‌కు సంబంధించిన దృశ్యాలు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. బైక్ నంబర్, నిందితులు వెళ్లిన మార్గాన్ని గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.నగరంలోని మరో రెండు ప్రాంతాల్లోనూ ఇదే తరహాలో చైన్ స్నాచింగ్ ఘటనలు జరిగినట్లు సమాచారం ఉండటంతో పోలీసులు ఆ కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. వరుస ఘటనల నేపథ్యంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

ఓర్వకల్ సామాజిక ఆరోగ్య కేంద్రం ఆసుపత్రిలో శిశువు మృతి.

వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటున్న బంధువులు!

చికిత్సలో నిర్లక్ష్యం జరిగిందంటూ ఆగ్రహం.. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



ఓర్వకల్లు ప్రతినిధి, సెప్టెంబర్ 29 (రిపబ్లిక్ న్యూస్) కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గుడుంబాయి తాండకు చెందిన గర్భిణీ ప్రసవం కోసం ఆసుపత్రిలో చేరగా, శిశువు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.వైద్యులు సకాలంలో సరైన వైద్యం అందించకపోవడం, చికిత్సలో నిర్లక్ష్యం చేయడం వల్లే శిశువు మృతి చెందిందని బంధువులు ఆరోపించారు. దీంతో ఆసుపత్రిలో వైద్య సేవల తీరుపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ మృత శిశువు బంధువులు ఓర్వకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఘటనకు బాధ్యులెవరో విచారించి తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు.అయితే శిశువు మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమన్న ఆరోపణలు ప్రస్తుతం బంధువుల ఫిర్యాదు, ఆరోపణలకే పరిమితమయ్యాయి. పోలీసుల విచారణ, వైద్యపరమైన పరిశీలన అనంతరం పూర్తి వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

ఓర్వకల్ మండలంలో 45 పాఠశాలల్లో ప్రశాంతంగా పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నికలు

ఎంఈఓ జి. ఓంకార్ యాదవ్ ప్రత్యేక పర్యవేక్షణలో ఎన్నికల నిర్వహణ

రెండు పాఠశాలల్లో కోరం లేక వాయిదా



ఓర్వకల్, సెప్టెంబర్ 29 (రిపబ్లిక్ న్యూస్): ఓర్వకల్ మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో నూతన పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నికలు మంగళవారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. మండల విద్యాశాఖ అధికారి జి. ఓంకార్ యాదవ్ ప్రత్యేక పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు.మండలంలోని మొత్తం 47 పాఠశాలలకు గాను 45 పాఠశాలల్లో పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా పూర్తయ్యాయి. ఈ ఎన్నికల్లో కమిటీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడితో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.అయితే కేతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు లోద్దిపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల కోరం లేకపోవడంతో ఎన్నికలను వాయిదా వేశారు. పై అధికారులు తదుపరి తేదీని ప్రకటించిన అనంతరం ఈ రెండు పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి తెలిపారు.ఎన్నికల ప్రక్రియ మొత్తం ప్రశాంతంగా జరిగేలా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

బానుముక్కల అంగన్వాడి కేంద్రం-1లో ఘనంగా అంగన్వాడి ఉత్సవాలు:-లలిత ప్రభావతమ్మ(సూపర్వైజర్)



పాములపాడు సెప్టెంబర్ 29 రిపబ్లిక్ న్యూస్:-పాములపాడు మండలంలోని, భానుముక్కల గ్రామంలో ఉన్న 1వ సెంటర్ నందు అంగన్వాడి టీచర్ ఎం.స్వాతి ఆధ్వర్యంలో నిర్వహించిన (సేవా సంకల్ప్ అభియాన్) అంగన్వాడీ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా ఐసిడిఎస్ సూపర్వైజర్ లలిత ప్రభావతమ్మ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ లలిత ప్రభావతమ్మ మాట్లాడుతూ 3-5 సంవత్సరాలలోపు పిల్లలకు అట,పాటలతో విద్య పిపి1, పీపీ2 బుక్స్ వ్రాయించడం జరుగుతుందనీ, అలాగే మెనూ ప్రకారం భోజనం అందించడం జరుగుతుందనీ అన్నారు. ప్రధాన మంత్రి మాతృత్వ వందన గురించి చెప్పడం జరిగింది. పోషకహారం ప్రతి తల్లి బిడ్డ హక్కు అని, ఆరోగ్యంగా అమ్మ ఉన్నప్పుడు సురక్షితంగా బిడ్డ కూడా ఉంటుందన్నారు. పోషకారంతో ఆనందమైన కుటుంభం, మెరుగైన ఆరోగ్యశే కోసం రంగు రంగుల సహజ సిద్ద ఆహారం తీసుకోవాలని అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ ఎం.స్వాతి, ఏఎన్ఎం మునెమ్మ, ఆశ వర్కర్లు, గర్భిణీ లు, భలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

హరిత ఇంధనానికి సీమ హబ్

పవన, సౌర విద్యుత్‌తో పీక్ అవర్స్ కొరతకు చెక్

విస్తరణతో మారుతున్న పల్లె రూపురేఖలు



కర్నూలు/అనంతపురం, సెప్టెంబరు 29 (రిపబ్లిక్ న్యూస్): పునరుత్పాదక ఇంధన రంగంలో రాయలసీమ కీలక కేంద్రంగా ఎదుగుతోంది. సౌర, పవన విద్యుత్ ఉత్పత్తికి అనుకూలమైన భౌగోళిక పరిస్థితులు ఉండటంతో అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ కడప జిల్లాల్లో హరిత ఇంధన ప్రాజెక్టులు విస్తరిస్తున్నాయి. విద్యుత్ డిమాండ్ అధికంగా ఉండే పీక్ అవర్స్‌లో పవన, సౌర విద్యుత్ ఉత్పత్తి గ్రిడ్‌కు తోడ్పాటునందిస్తోంది.

స్థానిక ఆర్థిక కార్యకలాపాలకు ఊతం లభించే అవకాశం

దేశవ్యాప్తంగా క్లీన్ ఎనర్జీ వైపు మార్పు వేగం పుంజుకుంటున్న నేపథ్యంలో సీమలోని ప్రాజెక్టులకు ప్రాధాన్యం పెరుగుతోంది.పవన, సౌర విద్యుత్ ప్రాజెక్టులు విద్యుత్ ఉత్పత్తికే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కూడా దోహదపడుతున్నాయి. భారీ టర్బైన్లు, సౌర ప్యానెళ్లను మారుమూల ప్రాంతాలకు తరలించేందుకు నిర్మిస్తున్న రహదారులు స్థానిక గ్రామాలకు రవాణా మార్గాలుగా ఉపయోగపడుతున్నాయి. దీంతో కొండలు, గుట్టలు, అంతర్గత గ్రామాలకు రాకపోకలు మెరుగుపడుతున్నాయి. ప్రాజెక్టుల పరిసరాల్లో పాఠశాలల అభివృద్ధి, తాగునీటి సదుపాయాలు, ఆరోగ్య శిబిరాలు వంటి సామాజిక బాధ్యత కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు.అయితే హరిత ఇంధన ప్రాజెక్టుల విస్తరణలో స్థానిక ప్రజలతో పారదర్శక సమాచార వ్యవస్థ అవసరం. భూముల లీజు నిబంధనలు, చెల్లింపులు, ప్రాజెక్టుల వల్ల కలిగే ప్రత్యక్ష, పరోక్ష ప్రయోజనాలు, ఫిర్యాదుల పరిష్కార విధానంపై రైతులకు స్పష్టమైన సమాచారం అందాలి. సంస్థలు, రైతులు, స్థానిక ప్రజల మధ్య సమన్వయం ఉంటే అపోహలు తొలగడంతో పాటు ప్రాజెక్టుల అమలు సజావుగా సాగే అవకాశం ఉంటుంది. వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు పునరుత్పాదక ఇంధనానికి ప్రాధాన్యం పెరుగుతున్న వేళ రాయలసీమలోని సహజ వనరులు కీలకంగా మారుతున్నాయి. పర్యావరణ పరిరక్షణతో పాటు రహదారులు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి, స్థానిక ఆర్థిక కార్యకలాపాలకు ఊతం లభించే అవకాశం ఉంది. హరిత ఇంధన ప్రాజెక్టులు మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తే సీమ పల్లెల్లో అభివృద్ధికి కొత్త మార్గాలు తెరుచుకునే అవకాశముంది.

స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ సన్నద్ధం

ఉమ్మడి కర్నూలు జిల్లా నేతలతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమావేశం





కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 29) స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు కర్నూలులో సమావేశమయ్యారు. వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పార్టీ నేతలకు పలు సూచనలు, దిశానిర్దేశాలు చేశారు.ఈ సమావేశానికి కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, ఎమ్మెల్సీలు కల్పలతారెడ్డి, మధుసూదన్, కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త బుట్టా రేణుక, నియోజకవర్గాల ఇన్‌చార్జులు, రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయ మనోహరితో పాటు పలువురు పార్టీ నాయకులు హాజరయ్యారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రజా సమస్యలను గుర్తించి వాటిని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని నేతలకు దిశానిర్దేశం చేశారు.

పోలీసులను ఉపయోగించి ఎన్నికలు నిర్వహిస్తే న్యాయపోరాటం

సమావేశం అనంతరం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మీడియాతో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించాలని కోరారు. ఎన్నికల నిర్వహణలో పోలీసు యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకుని ఏకపక్షంగా వ్యవహరిస్తే న్యాయపోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

ఓర్వకల్‌లో రూ.2.5 కోట్లతో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



ఓర్వకల్, సెప్టెంబర్ 29 (రిపబ్లిక్ న్యూస్): గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పాణ్యం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న పల్లె పండుగ3 వారోత్సవాల్లో భాగంగా ఓర్వకల్ మండల కేంద్రంలో రూ.2.5 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి భూమిపూజ చేశారు.మండల కేంద్రంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో రహదారులు, డ్రైనేజీలు, మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి ప్రజలకు మెరుగైన జీవన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. నాణ్యత విషయంలో రాజీపడకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. మరియుఓర్వకల్లు మండల కేంద్రంలోని పశు వైద్య కేంద్రాన్ని ఈ సందర్భంగా రైతులకు సబ్సిడీపై గడ్డి విత్తనాలను పంపిణీ చేశారు.పశువులకు అవసరమైన దాణా కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా గడ్డి విత్తనాలను సబ్సిడీపై అందిస్తోందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డితెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని పశుపోషణను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశు వైద్యశాఖ అధికారులు, మండల టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.
ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రూ.73.95 లక్షలతో సీసీ రోడ్లకు భూమిపూజ

పల్లె పండుగతో గ్రామీణ ప్రాంతాలకు కొత్త వెలుగు

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్





అనంతపురం సంక్షేమం, సెప్టెంబర్ 29,(రిపబ్లిక్ న్యూస్) 20 సంవత్సరాల సమస్యకు మూడు నెలల్లోనే పరిష్కారం చూపించామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. పల్లె పండుగ3.0లో భాగంగా రుద్రంపేట పంచాయతీ పరిధిలోని చంద్రబాబునగర్ చైతన్య కాలనీలో రూ.73.95 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు మంగళవారం భూమిపూజ చేశారు.

ముంపు సమస్యకు కూడా పరిష్కారం లభిస్తుంది

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంతో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి పల్లె పండుగ3.0 కింద రూ.2.35 కోట్ల నిధులు మంజూరయ్యాయని, వాటితో రోడ్లు, డ్రైనేజీ తదితర పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మూడు నెలల క్రితం చైతన్య కాలనీలో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి వచ్చినప్పుడు స్థానికులు రోడ్డు సౌకర్యం లేక ఎదుర్కొంటున్న ఇబ్బందులను తన దృష్టికి తీసుకొచ్చారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. 20 ఏళ్లుగా రోడ్డు సమస్య పరిష్కారం కాలేదని వారు చెప్పడంతో అప్పుడే సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఇచ్చిన మాట మేరకు నిధులు మంజూరు చేయించి మూడు నెలల్లోనే పనులు ప్రారంభించామని చెప్పారు. గతంలో స్వల్ప వర్షాలకే చైతన్య కాలనీ ముంపునకు గురయ్యేదని, కొత్తగా సీసీ రోడ్లతో పాటు పటిష్టమైన డ్రైనేజీ వ్యవస్థను నిర్మించడంతో ముంపు సమస్యకు కూడా పరిష్కారం లభిస్తుందని వివరించారు.ప్రజా సంక్షేమంతో పాటు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

పీర్ల గుడికి రూ.50 వేల విరాళం


సామాజిక సేవలో ముందుంటున్న ఎం.కె. చౌదరి




గుత్తి, సెప్టెంబర్ 29: (రిపబ్లిక్ న్యూస్) గుత్తి పట్టణంలోని బెస్తగేరి ప్రాంతంలో ఉన్న పీర్ల గుడి అభివృద్ధి, నిర్వహణకు పట్టణ అధ్యక్షుడు ఎం.కె. చౌదరి రూ.50 వేల విరాళాన్ని అందజేశారు. మంగళవారం బెస్తగేరి ప్రాంతానికి చేరుకున్న ఆయన ఆలయ నిర్వాహకులకు విరాళాన్ని అందించారు. ఆలయ అభివృద్ధి, నిర్వహణకు తన వంతు సహకారం అందించడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా తెలిపారు.బెస్తగేరి ప్రజలు మాట్లాడుతూ.. పీర్ల గుడి అభివృద్ధికి ఎం.కె. చౌదరి రూ.50 వేల విరాళం అందించడం అభినందనీయమన్నారు. సామాజిక, సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుంటూ ప్రజల అవసరాలకు తనవంతు సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. పీర్ల గుడి అభివృద్ధికి అందించిన విరాళం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.ప్రజా కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలకు సహకరిస్తూ ముందుకు సాగుతున్న ఎం.కె. చౌదరికి బెస్తగేరి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన సేవా కార్యక్రమాలు మరింత కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బెస్తగేరి ప్రాంత ప్రజలు, ఆలయ నిర్వాహకులు, స్థానికులు పాల్గొన్నారు.

నగరడోన విద్య కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ కు శుభాకాంక్షలు

ఆలూరు నియోజకవర్గం ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి, వైకుంఠం శివప్రసాద్, సాగునీటి అధ్యక్షుడు నగరడోన కిష్టప్ప







చిప్పగిరి, సెప్టెంబర్, 29,(రిపబ్లిక్ న్యూస్) చిప్పగిరి మండలం నగరడోన గ్రామంలో జరిగిన విద్య కమిటీ చైర్మన్గా ఎన్నికైన సొట్టన్న గారి భారతి, వైస్ చైర్మన్ గా హరిజన యోగానంద్ కు ఆలూరు నియోజకవర్గం ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి, వైకుంఠం శివప్రసాద్ ,సాగునీటి అధ్యక్షుడు నగరడోన కిష్టప్ప శుభాకాంక్షలు తెలిపారు, అనంతరం సాగునీటి అధ్యక్షుడు నగరడోన కిష్టప్ప మాట్లాడుతూ పాఠశాలల పురోగతితోనే విద్యార్థుల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని విద్యార్థుల నాణ్యమైన విద్య మెరుగైన మౌలిక వసతులు ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం విద్యా కమిటీ సభ్యులు బాధ్యత యుక్తంగా వ్యవహరించాలని సూచించారు, తల్లిదండ్రులతో సమన్వయం చేసుకుంటూ పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు, అలాగే మెంబర్లుగా ఎన్నికైన బోయ సుంకమ్మ, కావలి ఈశ్వర్ నాయుడు, ఓసాలి రఘునాథ్, ముసన్నపల్లి మంజుల, పి. పద్మజ, కృష్ణవేణి, సుంకమ్మ, పల్లి లక్ష్మీనారాయణ, గొల్ల చిల్లర తిప్పయ్య, బోయ నాగరాజు, ఎరుకల నాగరాజు, కుండే భాగ్యమ్మ, రేణుక, అభినందనలు తెలిపారు,ఈ కార్యక్రమంలో గొల్ల రామకృష్ణ, కోట్ల వెంకటేష్, కమ్మ శ్రీనివాసులు , కమ్మ రంగస్వామి, గొల్ల సంజీవ రాయుడు,తలారి నాగరాజు, సొట్టన్న గారి నాగార్జున, భాస్కర్, బోయ వండ్రయ్య, అర్థగేరి మల్లయ్య, పులుసు రామాంజనేయులు, కొట్టం సుంకన్న, కుమ్మరి శీను, మందుల రమేష్, హరిజన మల్లేష్, హరిజన విజయ్, హరిజన రాయుడు, బోయ ఎర్ర సజ్జప్ప, చిట్టి ఈరన్న, సొట్టన్న గారి నాగన్న, సొట్టన్న గారి లక్ష్మి, గొల్ల వెంకటరాముడు, గొల్ల పంపాపతి, ఉప్పర గోపాల్, గారింటి నాగార్జున, సొట్టన్న గారి నాగేంద్ర, హరిజన మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ ప్రైమరీ స్కూల్ చైర్మన్‌గా జి. రోజా ఏకగ్రీవ ఎన్నిక.



రేణిగుంట సెప్టెంబర్ :29(రిపబ్లిక్ న్యూస్)
తిరుపతి జిల్లా రేణిగుంట మండల పరిధిలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న పాంచాలి నగర్ 14వ వార్డులోని మండల పరిషత్ ప్రాథమిక మోడల్ పాఠశాల నూతన పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నికలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడ్డాయి. పాఠశాల నూతన విద్యా కమిటీ చైర్మన్‌గా జి. రోజా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు హెచ్ఎంఅరుణ మరియు ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక గ్రామస్తులతో ప్రాథమిక సమావేశం నిర్వహించారు. పాఠశాల మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడం, మరియు పాఠశాల ప్రగతికి తీసుకోవాల్సిన చర్యలపై క్షుణ్ణంగా చర్చించారు. సమావేశంలో భాగంగా నూతన కమిటీ సభ్యులను సర్వామోదంతో ఎన్నుకోవడం జరిగింది. కమిటీ వివరాలు & ఘన సత్కారం:ఈ నూతన కమిటీలో:చైర్మన్: జి. రోజా వైస్ చైర్మన్: ఎం. మల్లిక కమిటీ సభ్యులు: 23 మంది నూతనంగా ఎన్నికైన చైర్మన్ జి. రోజాను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ నిర్మలతో పాటు ఉపాధ్యాయులు ఏ. మురళి, సౌజన్య మురళి, భావజాన్ తదితర ఉపాధ్యాయ బృందం శాలువా కప్పి ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు.

పాఠశాల అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తా నూతన చైర్మన్ జి. రోజా:
సత్కార అనంతరం నూతన చైర్మన్ జి. రోజా మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పాఠశాల చైర్మన్‌గా ఎన్నుకున్నందుకు ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, స్థానికులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పాఠశాల సమగ్ర అభివృద్ధికి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు మరియు తల్లిదండ్రుల సహకారంతో నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించడమే తమ నూతన కమిటీ యొక్క ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్.ఎం, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ పెద్దలు, నూతన కమిటీ సభ్యులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

లీనియర్ ప్రాజెక్టుల మట్టి తవ్వకాలపై నిబంధనలు తప్పనిసరి

పర్యావరణ ప్రమాణాలకు అనుగుణంగానే అనుమతులు.. నిర్దేశిత పరిమితి దాటితే చర్యలు -జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి





కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 29)
లీనియర్ ప్రాజెక్టులకు అవసరమైన మట్టి తవ్వకాలు, తరలింపులకు అనుమతులు మంజూరు చేసే సమయంలో సంబంధిత నిబంధనలు, పర్యావరణ ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు.
కలెక్టరేట్‌లో లీనియర్ ప్రాజెక్టులకు మట్టి తవ్వకాల సమయంలో పాటించాల్సిన ప్రామాణిక నిబంధనలు, పర్యావరణ భద్రతా విధానాలపై జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టి తవ్వకాల అనుమతులకు సంబంధించిన మూడు దరఖాస్తులను కమిటీ పరిశీలించింది.
శ్రీ ఎస్‌సీఎల్ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్, ఎంఎస్ఆర్‌సీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలకు సంబంధించిన ప్రతిపాదనలను కలెక్టర్ పరిశీలించారు. శ్రీ ఎస్‌సీఎల్ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ సంస్థకు సంబంధించి రైల్వే పనుల కోసం పెద్దటేకూరు గ్రామంలోని సర్వే నంబర్ 112లో మట్టి తవ్వకాలకు అనుమతి కోరిన నేపథ్యంలో అవసరమైన స్కెచ్‌ను సమర్పించేలా చర్యలు తీసుకోవాలని కల్లూరు తహసీల్దార్‌ను ఆదేశించారు.
అవసరమైన పత్రాలు పూర్తిస్థాయిలో సమర్పించిన సంస్థలకు నిబంధనల మేరకు అనుమతులు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మట్టి తవ్వకాల సమయంలో తవ్వకం లోతు, జలవనరుల పరిరక్షణ తదితర అంశాలను తప్పనిసరిగా పాటించేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.
తవ్వకాల ప్రాంతాల్లో తగిన డ్రైనేజీ సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో పాటు, పై మట్టిని ప్రత్యేకంగా తొలగించి భద్రపరచాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్దేశించిన పరిమితి మేరకే మట్టి తవ్వకాలు చేపట్టాలని, పనులు పూర్తయిన అనంతరం భూమిని సమతలీకరించడం, తిరిగి మట్టితో నింపడం, సురక్షితమైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు వంటి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
అనుమతి పొందిన ప్రాంతంలోనే మట్టి తవ్వకాలు చేపట్టాలని, ప్రాంతాన్ని మార్చాల్సిన అవసరం ఉంటే సంబంధిత సంస్థ తిరిగి అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. మొత్తం 20 వేల ఘనపు మీటర్ల పరిమితిలోనే మట్టి తవ్వకాలు చేపట్టాలని, అంతకు మించి తవ్వకాలు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
సమావేశంలో గనుల శాఖ ఉపసంచాలకులు నాగిని, కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజినీర్ కిషోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచలింగాలలో ఎస్ఎంసీ ఎన్నికల్లో టీడీపీ హవా

ఏడు ప్రభుత్వ పాఠశాలల్లో చైర్మన్లు, వైస్‌చైర్మన్లుగా టీడీపీ మద్దతుదారుల ఏకగ్రీవ ఎన్నిక



కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 29 (రిపబ్లిక్ న్యూస్)
కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు సొంత గ్రామమైన పంచలింగాలలో ప్రభుత్వ పాఠశాలల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ హవా కొనసాగింది. గ్రామంలోని ఏడు ప్రభుత్వ పాఠశాలల్లో ఎంపీ నాగరాజు గారు బలపరిచిన టీడీపీ మద్దతుదారులు చైర్మన్లు, వైస్‌చైర్మన్లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
ఎం.పి.పి.ఎస్. ఉర్దూ ఎలిమెంటరీ పాఠశాల చైర్మన్‌గా షేక్ మున్నా, వైస్‌చైర్మన్‌గా షేక్ నస్రీన్; ఎం.పి.పి.ఎస్. తెలుగు పాఠశాల చైర్మన్‌గా బి. గంగాధర్, వైస్‌చైర్మన్‌గా ఏ. రేణుక; జెడ్‌పీహెచ్ఎస్ ఉర్దూ పాఠశాల చైర్మన్‌గా షేక్ షాజహాన్, వైస్‌చైర్మన్‌గా షేక్ గుడియా; జెడ్‌పీహెచ్ఎస్ తెలుగు పాఠశాల చైర్మన్‌గా జి. కృష్ణ యాదవ్, వైస్‌చైర్మన్‌గా సువర్ణ; కేజీబీవీ పాఠశాల చైర్మన్‌గా తలారి లక్ష్మి, వైస్‌చైర్మన్‌గా పావని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.నూతనంగా ఎన్నికైన విద్యా కమిటీ చైర్మన్లు, వైస్‌చైర్మన్లు ఎంపీ బస్తిపాటి నాగరాజుని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు వారిని సన్మానించి అభినందనలు తెలిపారు. పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు చైర్మన్లు, వైస్‌చైర్మన్లు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో ముప్పసాని సుధాకర్ (ఎంఆర్‌పీఎస్), ముప్పసాని రాజేష్, ముప్పసాని సంజీవ రాజు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులపై పోలీసుల దౌర్జన్యం

బెజవాడ ఘటనను తీవ్రంగా ఖండించిన ఐలు -అక్రమ కేసులు ఎత్తివేయాలని జిల్లా కమిటీ డిమాండ్

అనంతపురం క్రైమ్, సెప్టెంబర్ 29,(రిపబ్లిక్ న్యూస్)
బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులపై పోలీసులు వ్యవహరించిన తీరును ఐలు అనంతపురం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. న్యాయవాది ఒగ్గు గవాస్వర్‌పై రౌడీషీట్ తెరవాలనే ప్రయత్నాన్ని విరమించుకోవాలని, న్యాయవాది సుభాన్‌పై నమోదు చేసిన కేసుతోపాటు సివిల్ వివాదానికి సంబంధించి న్యాయవాది పలగొని రవిపై నమోదైన కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది.

నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కు
ఈ మేరకు ఐలు అనంతపురం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరమాసప్ప, సతీష్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయా అంశాలపై బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులు విధులు బహిష్కరించి శాంతియుతంగా నిరసన చేపట్టారని తెలిపారు. ఎం.జి. రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించేందుకు ప్రదర్శనగా వెళ్తున్న న్యాయవాదులపై, ముఖ్యంగా మహిళా న్యాయవాదులపై పోలీసులు వ్యవహరించిన తీరును తప్పుబట్టారు.శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కు అని పేర్కొన్నారు. అలాంటి నిరసనను అడ్డుకునేలా బలప్రయోగం, నిర్బంధ చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న న్యాయవాదులను 'రోప్ పార్టీ'ల ద్వారా నిర్బంధించడాన్ని ఐలు వ్యతిరేకిస్తోందన్నారు.
ప్రజలు, న్యాయవాదుల ప్రజాస్వామ్య హక్కులను గౌరవించేలా పోలీసు వ్యవస్థ తన వైఖరిని సమీక్షించుకోవాలని సూచించారు. బార్, పోలీసు వ్యవస్థలు న్యాయవ్యవస్థలో కీలక భాగస్వాములని, పరస్పర గౌరవం, సంయమనం, చట్టబద్ధ విధానాలతో వ్యవహరించాల్సిన బాధ్యత ఇరువురిపై ఉందన్నారు.న్యాయవాదులపై జరిగిన ఘటనకు బాధ్యులైన పోలీసు అధికారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులపై నమోదైన కేసులను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు.బెజవాడ బార్ అసోసియేషన్ చేపట్టే భవిష్యత్ కార్యాచరణలో ఐలు భాగస్వామిగా ఉంటుందని, న్యాయవాదుల హక్కులు, రక్షణ కోసం చురుకైన పాత్ర పోషిస్తుందని జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వీరమాసప్ప, సతీష్ తెలిపారు.

విద్యా కమిటీ చైర్మన్ గా మారాసు లక్ష్మీదేవి

కడమల కాల్వలో చైర్మన్ గా మండ్ల శివకృష్ణ





బండి ఆత్మకూరు, సెప్టెంబర్ 29,(రిపబ్లిక్ న్యూస్):-
బండి ఆత్మకూరు మండలంలో విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మంగళవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు విద్యాశాఖ అధికారులు నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని ఈర్నపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు మాధురి ఎన్నికలు నిర్వహించగా చైర్మన్ గా అదే గ్రామానికి చెందిన మారాసు లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ సుందరంను విద్యార్థుల తల్లిదండ్రులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన చైర్మన్, వైస్ చైర్మన్ లతో పాటు సభ్యులతో ఆమె ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు పిట్టం రామకృష్ణారెడ్డి, బండి శ్రీను, సిద్ధం ప్రతాప్ రెడ్డి, అన్యం శంకర్ రెడ్డి, పిట్టం శ్రీనివాసరెడ్డి, సోముల వీరనారాయణరెడ్డి, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. దీంతో బండి శ్రీను, నెమలయ్య చెరో 10 కుర్చీలు, లక్ష్మయ్య బీరువా తెచ్చి ఇస్తామని హామీ ఇచ్చారు. అలాగే మండలంలోని కడమల కాల్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల్లో చైర్మన్ గా అదే గ్రామానికి చెందిన మండ్ల శివకృష్ణ, వైస్ చైర్మన్ గా నూర్జహాన్ లను విద్యార్థుల తల్లిదండ్రులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కూటమి ప్రభుత్వం ప్రత్యేక కృషి.

..నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.

నంద్యాల సెప్టెంబర్ 29 (రిపబ్లిక్ న్యూస్) :
గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి మంగళవారం అన్నారు.
నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం జూపాడు బంగ్లా మండలం తరిగోపుల గ్రామం, కొత్తపల్లి మండలం ఎం. లింగాపురం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రారంభించారు. తరిగోపుల గ్రామంలో రెండు సిమెంట్ రోడ్లు, రెండు రక్షణ గోడలు రూ. 20 లక్షలతో పూర్తి చేసిన పనులను ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రారంభించారు. తరిగోపుల గ్రామానికి మినరల్ వాటర్ ప్లాంట్, అదనంగా సిమెంట్ రోడ్లు కూడా కొత్తగా మంజూరు చేస్తున్నట్లు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి గ్రామస్థులకు హామీ ఇచ్చారు. తరిగోపులలో మాజీ జడ్పీటీసీ, టీడీపీ సీనియర్ నాయకులు నాగేశ్వరావు, పి ఆర్ డి ఈ సుధాకర్ బాబు, ఏ ఈ బసిర్, ఎంపీడీఓ గోపినాథ్, తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ వెంకటరమణ, పారుమంచాల కరుణాకర్ రెడ్డి, శివ చంద్రుడు, బాలస్వామి, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.అలాగే కొత్తపల్లి మండలం ఎం. లింగాపురం గ్రామంలో ఎంపీ నిధులు రూ. 5 లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్ ను నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందుంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. మండల కేంద్రం కొత్తపల్లి గ్రామంలోని పురాతన తాండవ మల్లేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కామన్ గుడ్ ఫండ్ ద్వారా నిధుల విడుదలకు కృషి చేస్తానని, దేవాదాయ శాఖ అధికారుల సహకారంతో తాండవ మల్లేశ్వర స్వామి ఆలయ జీర్నోద్దారణ పనులకు అన్ని విధాలుగా సహకరిస్తానని గ్రామ పెద్దలకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి ఎంపీడీఓ మేరి, డిప్యూటీ తహసీల్దార్ అరుణ, ఆర్ డబ్ల్యూ ఎస్ ఏ ఈ జుబేర్, ఎం. లింగాపురం చిన్న పుల్లారెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ మహేష్ నాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి, నరాల శ్రీనాథ్ రెడ్డి, శివారెడ్డి, రామచంద్రారెడ్డి, మినరల్ వాటర్ కాంట్రాక్టర్ జగన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గ్రామాల్లో స్వచ్ఛత పాటించాలి - ఎంపీడీవో గాయత్రి



బండి ఆత్మకూరు, సెప్టెంబర్ 29,(రిపబ్లిక్ న్యూస్):-
గ్రామాల్లో ఎప్పటికప్పుడు స్వచ్ఛత పాటించి పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని ఎంపీడీవో గాయత్రి ఆదేశించారు. మంగళవారం ఆమె మండలంలోని భోజనం, పరమటూరు గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా పారిశుద్ధ్య కార్మికులు తడి చెత్త, పొడి చెత్తను వేరువేరుగా సేకరించాలన్నారు. అలాగే ప్రభుత్వం ప్రత్యేకంగా తీసుకువచ్చిన స్వచ్ఛ రథంను ప్రజలు వినియోగించుకునే విధంగా పంచాయతీ సెక్రటరీలు అవగాహన కలిగించాలని సూచించారు.స్వచ్ఛ రథం వినియోగంలో భాగంగా ప్రభుత్వం ప్రజలకు ప్రత్యేకంగా దసరా ధమాకా ఆఫర్ ప్రకటించినట్లు ఆమె తెలిపారు. ఒక కుటుంబం నుంచి సుమారు 10 కేజీలకు పైగా పొడి చెత్త డ్రై వేస్ట్ స్వచ్ఛరథం వాహనానికి అమ్మిన ప్రతి కుటుంబానికి ఒక టోకెన్ ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. అయితే ఈ టోకెన్ తీసుకున్న వారిలో దసరా సందర్భంగా లక్కీ డిప్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. వీటిలో మొదటి బహుమతిగా కంచుపట్టు చీర ,రెండో బహుమతిగా రైస్ కుక్కర్, మూడో బహుమతిగా డిన్నర్ సెట్ కేటాయించారని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ ప్రత్యేక అవకాశాన్ని ప్రజలు వినియోగించుకునే విధంగా పంచాయతీ సిబ్బంది ప్రజలను చైతన్య పరచాలని ఆదేశించారు. అనంతరం ఆమె సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి త్వరితగతిన సర్వేలు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ చంద్రనాయక్, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

ఈర్నపాడులో విషాదం

ఇంట్లో ఉరి వేసుకొని భార్య భర్తలు ఆత్మహత్య





బండి ఆత్మకూరు ,సెప్టెంబర్ 29 ,(రిపబ్లిక్ న్యూస్):- మండల పరిధిలోని ఈర్ణ పాడు గ్రామంలో భార్య భర్తలు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర కలకలం రేపింది. ఎన్నడూ లేని విధంగా గ్రామంలో భార్య భర్తలు ఒకేసారి ఉరివేసుకొని చనిపోవడంతో విషాదచాయలు అలుముకున్నాయి. వారి మృతిపై స్థానికులు పోలీసులకు విషయం తెలియజేశారు. ఈ క్రమంలో పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని వారి మృతి గల కారణాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఎస్సై జగన్మోహన్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గోపాల్ 58 ఆయన భార్య రమణమ్మ 53 మంగళవారం సాయంత్రం తమ నివాసం ఉంటున్న ఇంట్లోనే తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు వివరించారు. స్థానికుల సమాచారంతో తాము సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి వెళ్లి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.వారి కుమారుడు శివకుమార్ భారత రక్షణ శాఖ ఇండియన్ ఆర్మీలో పనిచేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. అయితే వారి మృతికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియ రాలేదని ఎస్ఐ తెలిపారు. కాగా వారు గత కొంతకాలం నుంచి కుటుంబ కలహాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తుంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించనున్నట్లు ఎస్సై వివరించారు తెలిపారు.

కుమ్మరి పెల్లిలో పోషణ మాసం

పాల్గొన్న సర్పంచ్ గుమ్మడి సంతోష్

పిల్లలకు పండ్లు పంపిచేసిన లైన్స్ క్లబ్ సభ్యులు



రాయికల్ మండలం సెప్టెంబర్,29(రిపబ్లిక్ న్యూస్)

పోషణ మాసం కార్యక్రమం జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కుమ్మరి పెల్లిలో సర్పంచ్ గుమ్మడి సంతోష్ అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ కొత్త గర్భిణీ నమోదు తల్లులకు రక్తహీనత మరియు పోషకాహారం గురించి వివరణ ఇవ్వడం జరిగింది అన్న ప్రసన కార్యక్రమం జరిగింది దీంట్లో ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ వారు అంగన్వాడి సెంటర్ పిల్లలకు పండ్లు ఇవ్వడం జరిగింది సూపర్వైజర్ రాదా సెక్రెటరీ రాజేష్ ఉప సర్పంచ్ కొడిమెల రాజశేఖర్ ఏఎన్ఎం ప్రశాంతి స్కూల్ హెడ్మాస్టర్ దేవలక్ష్మి, వార్డు మెంబర్ ఇద్దశి నవీన్ రెడ్డి, అంగన్వాడీ టీచర్లు వనిత, పద్మావతి, ఆశ వర్కర్లు సుష్మ,రజిత, తల్లులు గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు

రాయికల్ మండలంలో గురుకుల పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీ

విద్యార్థుల భద్రత, సౌకర్యాలకు అత్యంత ప్రాధాన్యత

ఆహారం, పారిశుధ్యం, ఉపాధ్యాయులువిద్యార్థుల హాజరు, మౌలిక వసతుల పరిశీలన-జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



రాయికల్ మండలం సెప్టెంబర్,29(రిపబ్లిక్ న్యూస్)



రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మంగళవారం జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని జగన్నాథ్ పూర్, ఒడ్డె లింగాపూర్ గ్రామాల్లోని రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పాఠశాలల నిర్వహణ, ఆహారం, పారిశుధ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూరెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఆహారం తయారీ, ఆహార పదార్థాల నిల్వ, వినియోగంలో నిర్దేశిత ప్రామాణిక నిర్వహణ విధానాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత, వంటశాలల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు తదితర అంశాలను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో వంటశాలల పరిస్థితులను పరిశీలించి, అవసరమైన చోట ఆధునీకరణ పనులను వీలైనంత త్వరగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుతున్నాయా, మౌలిక వసతుల్లో ఏవైనా లోపాలు ఉన్నాయా అనే అంశాలను క్షేత్రస్థాయిలో నిరంతరం పరిశీలిస్తూ, సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

రానున్న శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు స్నానానికి వెచ్చని నీరు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని, అవసరమైన దుప్పట్లు, ఇతర వసతులను ముందుగానే సమకూర్చాలని తెలిపారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల భవనాల్లో అవసరమైన మార్పులు, మరమ్మతులు చేపట్టి విద్యార్థులకు సురక్షితమైన, అనుకూలమైన వాతావరణం కల్పించాలని సూచించారు.

అనంతరం ఉప్పుమడుగు గ్రామంలో నిర్మాణంలో ఉన్న రెసిడెన్షియల్ పాఠశాల భవనాన్ని పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పనులను వేగవంతం చేసి నెలలోపు భవన నిర్మాణాన్ని పూర్తి స్థాయిలో పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పి. నరేష్, జిల్లా విద్యాశాఖ అధికారి కె.రాము, తహసీల్దార్ నాగార్జున, ఎంపిడివో బింగి చిరంజీవి ఉపాధ్యాయులు మరియు తదితరులు పాల్గొన్నారు.

శకునాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ గా తలారి రాధా, వైస్ చైర్మన్ గా కానుగల రామకృష్ణ

శకునాలజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్ గా తలారి రాధా, వైస్ ఛైర్మన్ గా కనగల రామకృష్ణ ఎన్నిక ఏకగ్రీవం

ఓర్వకల్లుప్రతినిధి, సెప్టెంబర్ 29,(రిపబ్లిక్ న్యూస్)

ఓర్వకల్ మండల పరిధిలోని శకునాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఎస్ఎంసి చైర్మన్ గా తలారి రాధా ఎన్నికయ్యారు.

మంగళవారం పాఠశాల సమావేశ మందిరంలో జరిగిన ఎస్ఎంసి ఎన్నికలను పాఠశాల ప్రధానోపాధ్యాయిని కమతం సునీత నేతృత్వంలో ఉపాధ్యాయ బృందం సమర్థవంతంగా నిర్వహించారు. ముందుగా ప్రతి తరగతి తల్లిదండ్రులందరినీ సమావేశపరిచి..తరగతుల వారిగా ముగ్గురు సభ్యులను ఓటర్లందరూ చేతులెత్తగా ఎన్నుకున్నారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ లను తరగతుల వారిగా ఎన్నికైన 15 మంది సభ్యులు చేతులెత్తి ఎన్నుకున్నారు. తలారి రాధను చైర్మన్గా, వైస్ చైర్మన్ గా కానుగల రామకృష్ణను సభ్యులందరూ ఎన్నుకున్న అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయిని కమతం సునీత చైర్మన్, వైస్ చైర్మన్



ల తో పాటు కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో చైర్మన్గా ఎన్నికైన తలారి రాధా మాట్లాడుతూ తనను చైర్మన్గా ఎన్నుకున్నందుకు కమిటీ సభ్యులకు, పాఠశాల విద్యార్థులతల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల విద్యా అభివృద్ధికి తోడ్పాటును అందిస్తానని ఆమె ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఎన్నికైన కమిటీ సభ్యులు మంగలి శేషమ్మ, మధ్యల లక్ష్మీదేవి, కానుగల రామకృష్ణ (ఆరవ తరగతి), ఈడిగ స్వరూప, కానుగల శేఖర్,ఈడిగ చాముండేశ్వరి, (ఏడవ తరగతి) తలారి రాధా, మద్దెల సుబ్బలక్ష్మి, శీలం బుచ్చన్న, (ఎనిమిదవ తరగతి) తోటబలిజ సుధాకర్, ఈడిగ లక్ష్మీదేవి శీలం ముని స్వామి(9వ తరగతి) బోయ మధు శేఖర్, మాసపోగు జ్యోతి, గొల్ల మధు(పదవ తరగతి) ఈ ఎన్నికకు సంబంధిత అధికారులు పేరెంట్స్ ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేశారు

కరువు కోరల్లో అనంతపురం

ఎండిపోయిన పండ్ల తోటలు, పశుగ్రాసం కరువు

వేల అడుగుల్లో బోర్లు.. ఉపాధి లేక వలసలు

రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబర్ 29,(రిపబ్లిక్ న్యూస్)

కరువు పరిస్థితులతో అనంతపురం జిల్లా విలవిల్లాడుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. వర్షాభావంతో పంటల సాగు గణనీయంగా తగ్గిపోవడంతో పాటు సాగు చేసిన పంటలు సైతం ఎండిపోయాయని, ఉద్యాన తోటలను కాపాడుకునేందుకు రైతులు అప్పులు చేసి బోర్లు వేస్తున్నా భూగర్భ జలాలు అందుబాటులోకి రావడం లేదని పేర్కొన్నారు. జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులపై సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 26 వరకు రెండు బృందాలుగా పలు ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించిన వివరాలను మంగళవారం కలెక్టర్ ఓ.ఆనంద్‌ను కలిసి వివరించారు.

ఎండిపోయిన తోటల రైతులకు తగిన పరిహారం ఇవ్వాలి

పుట్లూరు, యల్లనూరు, తాడిపత్రి, నార్పల, శింగనమల, గార్లదిన్నె, ఆత్మకూరు, అనంతపురం రూరల్ ప్రాంతాల్లో ఉద్యాన పంటల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. తోటలను కాపాడుకునేందుకు రైతులు అప్పులు చేసి లోతైన బోర్లు వేస్తున్నారని చెప్పారు. పుట్లూరు ప్రాంతంలో గతంలో 95100 అడుగులకే నీరు లభించేదని, ప్రస్తుతం 1,2001,600 అడుగుల వరకు బోర్లు వేసినా స్వల్పంగా మాత్రమే నీరు వస్తోందని తెలిపారు. నీరు అందక ఎండిపోయిన తోటలపై ప్రత్యేక సర్వే నిర్వహించి రైతులకు తగిన పరిహారం అందించాలని కలెక్టర్‌ను కోరారు.

పశుగ్రాసం కొరత, ధరల పెరుగుదలతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పశువులను పోషించే స్థోమత లేక కొందరు వాటిని అమ్ముకునే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. మరోవైపు ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. భూగర్భ జలాలు అడుగంటడంతో పాటు హెచ్ఎల్సీ నీటి సరఫరాలో సమస్యలు తలెత్తడంతో శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాల ద్వారా సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని వివరించారు. తాగునీరు, పశుగ్రాసాన్ని అత్యవసరంగా అందించాలని కోరారు.

పెండింగ్ పంటల బీమా కేసులను సత్వరం పరిష్కరించాలి

వ్యవసాయ పనులు తగ్గిపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి లేక వలసలు పెరుగుతున్నాయని శ్రీనివాసరావు తెలిపారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, ఆత్మకూరు, కూడేరు, గుత్తి ప్రాంతాల్లో వలస పరిస్థితులను తమ బృందాలు గుర్తించాయని చెప్పారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి 200 రోజుల పని, రోజుకు రూ.600 వేతనం కల్పించాలని, వ్యవసాయ కార్మికులు, పేద రైతులు, చేతివృత్తిదారులకు నెలకు రూ.10 వేల కరువు భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయని తెలిపారు. గత సంవత్సరాల్లో పరిహారం మంజూరై పెండింగ్‌లో ఉన్న కేసులతో పాటు ప్రస్తుత ఏడాది ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు వెంటనే పరిహారం అందించాలని, పెండింగ్ పంటల బీమా కేసులను సత్వరం పరిష్కరించాలని కోరారు. జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి జిల్లా ప్రజలను ఆదుకునేందుకు రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రైతులను రక్షించేందుకు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్‌లు ఏర్పాటు

సాగు చేసిన పంటలకు ఎకరానికి రూ.50 వేలు, బీడు భూములకు రూ.20 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని, వాస్తవ సాగుదారులైన కౌలు రైతులను గుర్తించి పరిహారం వారికే అందించాలని కోరారు.రైతుల రుణమాఫీ చేపట్టడంతో పాటు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల ఒత్తిళ్ల నుంచి రైతులను రక్షించేందుకు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్‌లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎండిపోయిన ఉద్యాన తోటలకు ఎకరాకు రూ.లక్షకు తగ్గకుండా పరిహారం ఇవ్వాలని, తిరిగి తోటలు పెంచుకునేందుకు ఉచిత మొక్కలు, డ్రిప్, ప్రారంభ పెట్టుబడి సాయం అందించాలని కోరారు. గ్రామ సచివాలయాన్ని యూనిట్‌గా తీసుకుని పశుగ్రాసం పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, శ్రీసత్యసాయిశ్రీరామిరెడ్డి తాగునీటి పథకాల్లో పనిచేస్తున్న కార్మికులకు నెలవారీ వేతనాలు చెల్లించి పథకాల నిర్వహణకు అంతరాయం లేకుండా చూడాలని కలెక్టర్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.నాగేంద్రకుమార్, బాలరంగయ్య, బి.శ్రీనివాస్, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి, రామ్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఆర్వీ నాయుడు, రామాంజనేయులు, నాగమణి, పరమేష్, అచ్యుత్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో మైనర్లకు చట్టబద్ధమైన రక్షణ కల్పించేలా సుప్రీంకోర్టు తీసుకున్న చొరవను స్వాగతించిన కోనేరు సంస్థ

కర్నూలు, సెప్టెంబర్ 29 (రిపబ్లిక్ న్యూస్) :

పిల్లల రక్షణ కోసం స్థానిక కర్నూలు జిల్లా స్థాయిలో పనిచేస్తున్న కోనేరు సంస్థ, సోషల్ మీడియా వేదికలు మరియు ఇతర డిజిటల్ మధ్యవర్తులు మైనర్లకు సంబంధించిన భారతీయ చట్టాలను కచ్చితంగా పాటించేలా చట్టబద్ధమైన నిబంధనలను తీసుకువచ్చే అవకాశాన్ని పరిశీలించాలని కేంద్రాన్ని ఆదేశిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతించింది. వీటితో పాటు ఈ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లతో స్వతంత్రంగా ఒప్పందాలు చేసుకునేందుకు నిర్ణయించిన 18 ఏళ్ల వయోపరిమితి నిబంధన కూడా ఇందులో ఉంది.

పిల్లలు ప్రస్తుతం సోషల్ మీడియాలో ఎక్కువ సమయం గడుపుతున్నారని, దీనివల్ల వారు ఆన్‌లైన్ లైంగిక వేధింపులు, గ్రూమింగ్, ట్రాఫికింగ్, సెక్స్‌టార్షన్ మరియు సైబర్ బుల్లీయింగ్ వంటి ప్రమాదాల బారిన పడుతున్నారని, ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు నిర్ణయం వారి ఆన్‌లైన్ రక్షణపై గొప్ప ప్రభావం చూపుతుందని సదరు సంస్థ తెలిపింది. డిజిటల్ వేదికలపై పిల్లలకు బలమైన రక్షణ కల్పించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్' (జే=జ) అలయన్స్ భాగస్వామ్య సంస్థగా కోనేరు ఉంది.

భారతీయ చట్టాల ప్రకారం డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను బాధ్యులను చేయడానికి అత్యున్నత న్యాయస్థానం చేసిన వ్యాఖ్య ఒక ముఖ్యమైన అడుగు అని కోనేరుసంస్థ డైరెక్టర్ M A Saleem పేర్కొన్నారు. "నేటి పిల్లలు తమ జీవితంలో అధిక భాగాన్ని ఆన్‌లైన్‌లో గడుపుతున్నారు, కానీ అందులోని ప్రమాదాలను పూర్తిస్థాయిలో అర్థం



చేసుకోలేకపోతున్నారు. సోషల్ మీడియాను మితిమీరి, పర్యవేక్షణ లేకుండా వాడటం వల్ల పిల్లలు లైంగిక వేధింపులు మరియు దోపిడీకి ఎలా గురవుతున్నారో మనం చూస్తున్నాం. ఈ ప్రమాదాలు కేవలం స్క్రీన్‌లకే పరిమితం కావు. పిల్లలను లక్ష్యంగా చేసుకుని, లోబరుచుకుని, చివరకు లైంగిక దోపిడీ మరియు మానవ అక్రమ రవాణా వంటి పరిస్థితుల్లోకి నెట్టివేస్తున్నారు. అందుకే ప్లాట్‌ఫారమ్‌లకు కఠినమైన రక్షణ చర్యలు మరియు జవాబుదారీతనం తక్షణమే అవసరం" అని డైరెక్టర్ అన్నారు.ప్రస్తుత చట్టాల ప్రకారం మైనర్లు చేసుకునే ఒప్పందాలు చెల్లవని ఉన్నప్పటికీ, డిజిటల్ వేదికలపై వారు స్వతంత్రంగా ఖాతాలను తెరవడానికి, నిర్వహించడానికి అనుమతించబడటంపై 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్' దాఖలు చేసిన పిటిషన్ ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పందిస్తూ, ఈ అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందని కోర్టుకు తెలిపింది. 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్' అనేది దేశవ్యాప్తంగా 782 జిల్లాల్లో విస్తరించి ఉన్న అతిపెద్ద ఎన్జీఓ నెట్‌వర్క్. ఇది డిజిటల్ వేదికలతో పాటు సమాజంలో పిల్లలకు ఎదురయ్యే బెదిరింపులు, ప్రమాదాలను గుర్తించి, అరికట్టడానికి ప్రజలు, ప్రభుత్వాలు మరియు చట్ట అమలు సంస్థలతో కలిసి పనిచేస్తుంది.కోనేరు సంస్థ కర్నూలు జిల్లా లో పిల్లల రక్షణ, సంక్షేమం మరియు హక్కుల కోసం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సంస్థ. బాలలపై దోపిడీ, వేధింపులు మరియు ఇతర ప్రమాదాలను నివారించడం, అలాగే సమాజ ఆధారిత బాలల రక్షణ వ్యవస్థలను బలోపేతం చేయడంపై సంస్థ ప్రధానంగా దృష్టి సారిస్తోంది.

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్సీ కోఆర్డినేటర్‌గా నియామకం..
బెక్కం జనార్ధన్‌కు ఘన సన్మానం



రాయికల్ మండలం సెప్టెంబర్,29 (రిపబ్లిక్ న్యూస్)ఉమ్మడి వరంగల్‌ఖమ్మంనల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా జనసేన పార్టీ తరఫున బెక్కం జనార్ధన్ నియమితులైన సందర్భంగా జగిత్యాల జిల్లాకు చెందిన జనసేన పార్టీ సీనియర్ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సీనియర్ నాయకులు మాట్లాడుతూ, పార్టీ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ పట్టభద్రుల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. పార్టీ బలోపేతం కోసం బెక్కం జనార్ధన్ చేస్తున్న కృషిని అభినందించారు.బెక్కం జనార్ధన్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో పార్టీ అప్పగించిన బాధ్యతను పూర్తి నిబద్ధతతో నిర్వహిస్తానని, పట్టభద్రుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో జగిత్యాల జిల్లా జనసేన పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగిత్యాల-కొత్తపేట నైట్ హాల్టు బస్సును పునరుద్ధరించండి
- జగిత్యాల డిఎంకు విజ్ఞప్తి చేసిన రామాజీపేట సర్పంచి బెజ్జంకి మోహన్

రాయికల్ మండలం సెప్టెంబర్,29(రిపబ్లిక్ న్యూస్)



జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కొత్తపేట గ్రామానికి జగిత్యాల నుండి రాయికల్ మీదుగా రామాజీపేట గ్రామం నుండి భూపతిపూర్ ద్వారా మూటపల్లి, కొత్తపేట బస్సును ఉదయం రాత్రి వేళలో బస్ తిరిగి ప్రారంభించాలని కోరుతూ రామాజీపేట సర్పంచ్ బెజ్జకి మోహన్ జగిత్యాల డిపో మేనేజర్కు వినతి పత్రం ఇచ్చారు గ్రామ ప్రజలు విద్యార్థులు ఉద్యోగులు ఇతర ప్రయాణికులు ఇబ్బందుల దృష్టిలో ఉంచుకొని గతంలో నడిచిన ఉదయం మరి రాత్రి బస్ సర్వీస్ను పునరుద్ధరించాలని డిపో మేనేజర్ను కోరగా వారి విజ్ఞప్తి మేరకు డిపో మేనేజర్ స్పందిస్తూ బస్ సర్వీసులు తిరిగి ప్రారంభించే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారని బెజ్జంకి మోహన్ తెలిపారు ఈ కార్యక్రమంలో గుజ్జుల మోహన్ రెడ్డి,సుర విజయ్లు పాల్గొన్నారుద

సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లా ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నివేదిత వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

రాయికల్ మండలం సెప్టెంబర్,29(రిపబ్లిక్ న్యూస్)



సేవాసంకల్పఅభియాన్ కార్యక్రమంలోభాగంగా ఈరోజు జగిత్యాల జిల్లా ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో జిల్లాలోని ఇటిక్యాల గ్రామంలో గల నివేదిత వృద్ధాశ్రమంలో వృద్దులకు పండ్లు పంపిణీ చేయడం జరిగింది,అలాగే వారికి సంబంధించిన యోగ క్షేమాలు తెలుసుకొని వారి అవసరాల రీత్యా సహాయం చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది ఇట్టి కార్యక్రమం లో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు మచ్చ నారాయణ, జిల్లా అధ్యక్షులు అన్నవేణి వేణు,ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు బాణావత్ తిరుపతి నాయక్, రాయికల్ పట్టణ అధ్యక్షులు కుర్మ మల్లారెడ్డి, రాయికల్ మండల అధ్యక్షులు ఆకుల మహేష్ మరియు సీనియర్ నాయకులు రొట్టె శ్రీధర్, కదర్ల శ్రీనివాస్, భయ్యని అంజి తదితరులు పాల్గొన్నారు

భూపతిపూర్ పాఠశాలను మండల స్థాయిలో ఉత్తమ ప్రాథమిక పాఠశాలగా ఎంపిక చేసి10,000 వేల రూపాయల ప్రోత్సాహం

రాయికల్ మండలం సెప్టెంబర్,29(రిపబ్లిక్ న్యూస్)



జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఎంపీపీస్ భూపతిపూర్ పాఠశాలను మండల స్థాయిలో ఉత్తమ ప్రాథమిక పాఠశాలగా ఎంపిక చేసి ,పాఠశాలకు ప్రోత్సకంగా10 000 నగదు రూపాయలను అందించారు పాఠశాలలో విద్యాభివృద్ధికి, విద్యార్థుల నూతన చేరికలకు నిరంతరం శ్రమిస్తున్న ప్రధానోపాధ్యాయులు ,ఉపాధ్యాయుల కృషిని మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు అభినందిస్తూ ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారంను అందజేశారు.పురస్కారం అందుకున్న ఉపాధ్యాయులు తీర్మొవెలూరి వేణుగోపాల్, గుర్రం మారుతి, జంగిలి నర్సయ్య, దీకొండ మల్లేశం.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుర్రం భావన మహేందర్, మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, మాజీ చైర్మన్ జక్కుల రాజేంద్రప్రసాద్, హై స్కూల్ భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు బొల్లె చిన్నయ్య,ఎం ఆర్ సి సిబ్బంది వెంకటేశ్వరరావు,రవీందర్ , పంచాయితీ సెక్రటరీ కడకుంట్ల ఆదిత్య రాజ్, కరోబార్ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీహెచ్ఈఎల్ ఏజీఎం కిషోర్ 54వ పుట్టినరోజు వేడుకలు
జన్మదిన శుభాకాంక్షల వెల్లువ.. ఘనంగా పుట్టినరోజు వేడుకలు"



సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 29 (రిపబ్లిక్ న్యూస్)

లింగంపల్లి:బీహెచ్ఈఎల్ ఏజీఎం ఈడీ కిషోర్ 54వ పుట్టినరోజు వేడుకలను సోమవారం ఆందోల్‌లో అభిమానులు, స్నేహితులు, శ్రేయోభిలాషుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కిషోర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా దేవరపల్లి సురేష్ మాట్లాడుతూ.. కిషోర్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. భగవంతుడి ఆశీస్సులు, తల్లిదండ్రుల దీవెనలు ఎల్లవేళలా ఆయనపై ఉండాలని, జీవితంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులతో ఆనందంగా జీవిస్తూ ఎల్లప్పుడూ ఆరోగ్యంగా, చిరునవ్వుతో ఉండాలని శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం కిషోర్ కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో దేవరపల్లి సురేష్, రాఘవేంద్ర కుమార్, సోమవరపు నరేంద్ర కుమార్, గుబ్బల రమేష్, కాంట్రాక్ట్ వర్కర్స్ మోహన్, జునైద్, స్వామి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు

జగిత్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో 25వ రక్తదాన శిబిరం ప్రారంభంచిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

రాయికల్ మండలం సెప్టెంబర్,29 (రిపబ్లిక్ న్యూస్)





ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జగిత్యాల జిల్లా బ్రాంచ్ ఆధ్వర్యంలో జగిత్యాల ఐఎంఏ భవన్ లో "డొనేట్ బ్లడ్ సేవ్ లైవ్స్" కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న 25వ రక్తదాన శిబిరాన్ని జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు. అనంతరం రక్త దాత లకు ప్రశంసా పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్తదానం ద్వారా రోడ్డు ప్రమాదాలు,ప్రసూతి,రక్తానికి సంబంధించిన వ్యాధులు ఇతర సమయాల్లో ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ నిరంతరం శిబిరాలు నిర్వహిస్తున్న ఐఎంఏ ప్రతినిధులను అభినందించారు.మానవ సేవ మాధవ సేవ అందరూ భావించాలి అన్నారు..ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ శ్రీనివాస్,ఐఎంఏ సెక్రటరీ అకుతోట శ్రీనివాసరెడ్డి,కోశాధికారి డా.సుధీర్,కౌన్సిలర్ ప్రశాంత్ రావు, డా.నాగరాజు,డా.శంకర్,డాకృష్ణ మూర్తి,విమెన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ , వైద్యులు, నాయకులు, ఐఎంఏ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సెకండరీ గ్రేడ్ టీచర్లపై బోధనేతర భారం తగ్గించాలి!జీవో నం.25ను వెంటనే సవరించాలి!
పి ఆర్ టి యు టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కుంబాల శ్రీనివాస్ రెడ్డి డిమాండ్

రాయికల్ మండలం సెప్టెంబర్,29(రిపబ్లిక్ న్యూస్)



రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 49 వేల మంది ఎస్ జి టి ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని పి ఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కుంబాల శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రాథమిక పాఠశాలల్లో జీవో 25 వలన అనేక పాఠశాలల్లో కేవలం ఇద్దరు లేదా ముగ్గురు ఉపాధ్యాయులతోనే బహుళ తరగతులు, బహుళ సబ్జెక్టులను బోధించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దీనికి తోడు యాప్‌ల నిర్వహణ, డేటా ఎంట్రీలు, వివిధ రకాల ఆన్‌లైన్ పనులు, రికార్డుల నిర్వహణ, ట్రైనింగులు, మీటింగులు ఇతర బోధనేతర బాధ్యతలు ఉపాధ్యాయులపై అదనపు భారాన్ని మోపుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా

ఎఫ్ ఎల్ ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసి/) పేరుతో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులపై మరింత అదనపు పనిభారం పెంచే చర్యలను వెంటనే విరమించుకోవాలని విద్యాశాఖ అధికారులను ఆయన కోరారు. ఇప్పటికే అనేక రకాల బాధ్యతలతో సతమతమవుతున్న ప్రాథమిక పాఠశాలలో ఉన్న ఇద్దరు లేదా ముగ్గురు ఉపాధ్యాయులు ఇన్ని రకాల బాధ్యతలను సమన్వయం చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన బోధన ఎలా అందించగలరని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉపాధ్యాయులు బోధనకు పూర్తి సమయం కేటాయించాల్సిన సమయంలో బోధనేతర పనులతో నిమగ్నం కావడం వల్ల విద్యార్థుల అభ్యసనపై ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఒకటి రెండు పాఠశాలలకు పరిమితమైన సమస్య కాదని, రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాథమిక పాఠశాలల్లో నెలకొన్న సాధారణ సమస్య అని పేర్కొన్నారు.

అందువల్ల జీవో నం.25ను వెంటనే సవరించి, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుని నియమించాలి, ప్రతి ప్రాథమిక పాఠశాలకు తప్పనిసరిగా ప్రధానోపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేశారు. అలాగే యాప్‌లు, డేటా ఎంట్రీలు, ఇతర బోధనేతర పనుల కోసం ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి ఎస్ జి టి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి, రాష్ట్రవ్యాప్తంగా ఎస్ జి టి ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

కొల్లం బ్రహ్మానంద రెడ్డి వర్ధంతి సందర్భంగా కబడ్డీ అసోసియేషన్‌కు ఆర్థిక సాయం

రైల్వేకోడూరు సెప్టెంబర్ 29 రిపబ్లిక్ న్యూస్.





ఉమ్మడి కడప జిల్లా మాజీ డిసిసిబి చైర్మన్ దివంగత వైఎస్ఆర్సిపి నాయకుడు కొల్లం బ్రహ్మానంద రెడ్డి వర్ధంతి మంగళవారం రైల్వేకోడూరులో ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమం రాష్ట్ర వైఎస్ఆర్సిపి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు, రైల్వేకోడూరు మాజీ వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది, బ్రహ్మానందరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు, ఈ సందర్భంగా దివంగత నేత బ్రహ్మానందరెడ్డి జ్ఞాపకార్థం రైల్వే కోడూరు నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన పురుషులు, మహిళల కబడ్డి టీంకు 15,000 ఆర్థిక సాయం అందజేసిన స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ రామిరెడ్డి ధ్వజారెడ్డి తెలిపారు, ఆయన వెంట మాజీ ఉప సర్పంచ్ లు,తోట శివసాయి, కౌరెడ్డి,సిద్దయ్య యాదవ్,లు బ్రహ్మానంద రెడ్డికి పూలమాలవేసి నివాళులు అర్పించారు, ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యురాలు అరుణ, ఓబులరెడ్డి,మాజీ సర్పంచులు హరికృష్ణా రెడ్డి, ప్రతాప్ రెడ్డి,దార్ల చంద్రశేఖర్ రావు,ఆర్ వి రమణ, సుబ్రమణ్యం రాజు,చెంగల్ రెడ్డి, గోపి, రమణయ్య,కృష్ణ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆనంద్ యాదవ్,ప్రసాద్, షఫీ, రెడ్డయ్య రెడ్డి, కుంచం హరి,మణి, నాగరాజు, వెంకటేష్,గారు మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కంప రాజుకు నివాళులు..

రైల్వే కోడూరు మండలం మాధవరం పాడు గ్రామానికి చెందిన కంప రాజు సురదన్ రాజు దశదిన కర్మ కార్యక్రమానికి హాజరై ఆయన చిత్రపటానికి రామిరెడ్డి ధ్వజా రెడ్డి పూలమాలవేసి నివాళులు అర్పించారు ఆయనతోపాటు మనం వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బొమ్మవరం విద్యా కమిటీ చైర్మన్ గా చక్రవర్తుల సుబ్రహ్మణ్యంరాజు ఏకగ్రీవంగాఎన్నిక.

రైల్వేకోడూరు సెప్టెంబర్ 29 రిపబ్లిక్ న్యూస్.





ఓబులవారిపల్లి మండలం బొమ్మ వరం గ్రామం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గా చక్రవర్తుల సుబ్రమణ్యం రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు, వైస్ చైర్మన్ గా కమల ఎన్నికయ్యారు, హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు రంగారావు, ఆధ్వర్యంలో విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి,

గత విద్యా కమిటీ ఎన్నికల్లో కూడా చక్రవర్తుల సుబ్రమణ్యం రాజు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు, ఈ పదవిని ఆయన రెండవ సారి అలంకరించడం విశేషం,

చక్రవర్తుల సుబ్బన్నమరాజు ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ఆయన కమిటీ సభ్యులకు విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు నాయకులకు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో

టీడీపీ సీనియర్ నాయకులు ఉమ్మలరాజు పిచ్చిరాజు,మాజీ ఎంపీటీసీ చేజర్ల శంకర్ రాజు, మాజీ సర్పంచ్ శకునాల నరసింహ రాజు, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు గడ్డం చంగల్ రాజు, చక్రవర్తుల శివ రాజు, డీలర్ ఉమ్మలరాజు సుబ్బరాజు,చంగల్ రాజు, గడ్డం సాంబాశివరాజు, నీటి సంఘం అధ్యక్షులు చక్రవర్తుల వెంకట సుబ్బరాజు,, లవిడి సుబ్బరాజు, బొమ్మ వరం కూటమి నాయకులు విద్యా కమిటీ ఎన్నిక అనంతరం కూడా చైర్మన్ రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ముక్కా రూపానందరెడ్డిని కలిసి శాలువా కప్పి సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు,

పుల్లంపేట మండలంలో ...

పుల్లంపేట మండలం రంగంపల్లి పంచాయతీ ఉప్పరపల్లి గ్రామ విద్యా కమిటీ చైర్మన్గా అడపాల బాల రెడ్డమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు మంగళవారం స్కూల్ ఆవరణలో జరిగిన ఎస్ ఎం సి ఎన్నికలు విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో జరిగినది అడపాల బాలారెడ్డి సభ్యులకు సిబ్బందికి విద్యార్థుల తల్లిదండ్రులకు సి ఆర్ ఎం సి బి సి పాల ఉమామహేశ్వర్ అకాడమిక్ ఇన్స్పెక్టర్ లక్ష్మీ కళావతి విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులు అంగన్వాడీ టీచర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు, విద్యార్థుల తల్లిదండ్రులు కమిటీ సభ్యులు ఉపాధ్యాయులు అందరూ అడపాల రెడ్డమ్మకు శుభాకాంక్షలు తెలియజేశారు,


టీ వై జె ఎఫ్ సంగారెడ్డి జిల్లా సెక్రెటరీగా బి. రాజు

నూతన బాధ్యతలు స్వీకరించిన బి రాజుకు

అపాయింట్‌మెంట్ లెటర్, ఐడీ కార్డు అందజేత

జిల్లాలో జర్నలిస్టుల ఐక్యతే లక్ష్యంగా టీ వై జె ఎఫ్ విస్తరణ

సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 29 (రిపబ్లిక్ న్యూస్)







తెలంగాణ యూత్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీ వై జె ఎఫ్) సంగారెడ్డి జిల్లా సెక్రెటరీగా నూతనంగా ఎన్నికైన బి. రాజుకు అపాయింట్‌మెంట్ లెటర్, ఐడీ కార్డును రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్ అందజేశారు. టీ వై జె ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డా. తనుగుల జితేందర్ రావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నరేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్ కుమార్, జాయింట్ సెక్రెటరీ బాగయ్య, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ తలారి ప్రకాష్ తదితరులు పాల్గొని బి. రాజుకు శుభాకాంక్షలు తెలిపారు.జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్ టీ వై జె ఎఫ్‌ను బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో కమిటీల ఏర్పాటు, జర్నలిస్టులకు ఐడీ కార్డులు, సర్టిఫికెట్లు, మెమెంటోలు, హెల్త్ కార్డులు అందజేస్తూ జర్నలిస్టులను ఒకే వేదికపైకి తీసుకురావడానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, ఐక్యత కోసం మరింత మంది రిపోర్టర్లను టీ వై జె ఎఫ్‌లోకి ఆహ్వానిస్తూ సంస్థను విస్తరించేందుకు షేక్ మహబూబ్ చేస్తున్న కృషి అభినందనీయమని సంతోష్ కుమార్ అన్నారు. ఆయన సేవలకు జర్నలిస్టుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బి. రాజు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా సెక్రెటరీగా అవకాశం కల్పించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, సంక్షేమం, ఐక్యత కోసం తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

రాయలసీమ ఉద్యాన సమగ్ర అభివృద్ధిపై నేడు నంద్యాలలో భారీ డ్రోన్ షో

ఆకాశంలో రంగురంగుల కాంతులతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఆవిష్కరణ

సాయంత్రం 5.30 గంటలకు కలెక్టరేట్ నుంచి ఔట్‌డోర్ స్టేడియం వరకు ట్రాక్టర్ల ర్యాలీ

పది రోజుల పాటు కళాజాత బృందాలతో హార్టికల్చర్ హబ్‌పై విస్తృత ప్రచారం



నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 29 (రిపబ్లిక్ న్యూస్)
రాయలసీమ ప్రాంతాన్ని ప్రపంచ స్థాయి ఉద్యానవన ఉత్పత్తుల కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గ్లోబల్ హార్టికల్చర్ హబ్ – రాయలసీమ రైజింగ్ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నంద్యాల పట్టణంలో ఈనెల 30వ తేదీ బుధవారం భారీ డ్రోన్ షో నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం 5.30 గంటలకు నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్ నుంచి ఔట్‌డోర్ స్టేడియం వరకు ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఈ ర్యాలీ, డ్రోన్ షోలో జిల్లా మంత్రులు, జిల్లా కలెక్టర్, అధికారులు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా, రాయలసీమ హార్టికల్చర్ హబ్ లక్ష్యాలు, ప్రయోజనాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సెప్టెంబర్ 30వ తేదీ నుంచి పది రోజుల పాటు కళాజాత బృందాల ద్వారా జిల్లావ్యాప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ వెల్లడించారు. కళారూపాల ద్వారా ఉద్యాన అభివృద్ధి ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, ఈ ప్రాజెక్టులో రైతులు, ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

అవగాహనతోనే హెచ్ఐవి రహిత సమాజం సాధ్యం

నంద్యాల జాయింట్ కలెక్టర్ సూరత్ ధనుంజయ్







నంద్యాల బ్యూరో , సెప్టెంబర్ 29 (రిపబ్లిక్ న్యూస్)
మంగళవారం నాడు ఎయిడ్స్ నివారణ ప్రచారం లో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వరకు 5 ఖ రెడ్ రన్ నిర్వహించిన రన్ లో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ జెండా ఊపిరి ప్రారంభజించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవగాహనతోనే హెచ్ఐవి రహిత సమాజం సాధ్యం అని జాయింట్ కలెక్టర్ శ్రీ. సూరజ్ ధనంజయ్ గనోరే పేర్కొన్నారు. హెచ్ఐవీ నియంత్రణలో భాగంగా ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించిందన్నారు. హెచ్ఐవి నివారణే ధ్యేయంగా విస్తృత ప్రచారం నిర్వహణ లో భాగంగా 5 ఎ రన్ ను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ అంశంపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. చికిత్స తీసుకోవడం ద్వారా హెచ్ఐవీతో జీవిస్తున్న వారు సాధారణ జీవితం కొనసాగించవచ్చని, చికిత్స ద్వారా వైరల్ లోడ్‌ను నియంత్రించడం వల్ల ఇతరులకు, ముఖ్యంగా తల్లి నుంచి బిడ్డకు సంక్రమణను నివారించేందుకు అవకాశం ఉంటుందని జాయింట్ కలెక్టర్ తెలిపారు. హెచ్ఐవీ పరీక్ష చేయించుకోవడంలో ఎలాంటి సిగ్గు లేదా భయం అవసరం లేదని, అవసరమైన యువత ముందుకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని జిల్లా ఆసుపత్రుల సమస్వయ అధికారి డాక్టర్. ఓ లలిత సూచించారు.అనంతరం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో యువత మరియు కళాశాల విద్యార్థులలో హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన "హెచ్ఐవి ఎయిడ్స్ అవేర్నెస్ మార్గం ఫైవ్ కిలోమీటర్ లు రెడ్ రన్" లో ప్రతిభ కనబరిచి పురుషుల విభాగంలో విజేతలుగా నిలిచిన వారికీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ శారద బాయి ప్రశశేశించారు. మొదటి బహుమతి సాధించిన ఆర్. బి. వినోద్ కుమార్,రెండవ బహుమతి సాధించిన ఏం. యోగ ఓబులేసు, అదే విధంగా మహిళల విభాగంలో మొదటి బహుమతి సాధించిన ఎమ్. సావిత్రి బాయి, రెండవ బహుమతి సాధించిన ప్రసన్న లను అభినందించి, రాష్ట్ర స్థాయిలో అక్టోబర్ 8 న జరిగే పోటీలలో పాల్గొంటారని డాక్టర్ శారదా బాయి తెలిపినారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు డా. భరత్, డాక్టర్ కాంత రావు నాయక్, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ అలీ హైదర్, జిల్లా క్రీడా శాఖ అధికారులు శ్రీనివాసులు, ప్రసాద్, స్వచ్ఛంద సంస్థల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వం ,క్విజ్ పోటీల నందు గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభ



నంద్యాల సెప్టెంబర్ 29 (రిపబ్లిక్ న్యూస్) :
నంద్యాల పట్టణం బాబా నగర్ నందు గల శ్రీ గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు అంతర్జాతీయ పర్యాటక దినోత్సవం పురస్కరించుకొని నంద్యాల జిల్లా పర్యాటక శాఖ వారు నిర్వహించిలిన వ్యాసరచన వక్తృత్వం క్విజ్ పెయింటింగ్ రీల్స్ పోటీల నందు 10 బహుమతులు సాధించినట్లుగా స్కూల్ డైరెక్టర్ పి షేక్షావలి రెడ్డిలిగారు తెలిపారు. అంతర్జాతీయ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టరేట్ లోని పి జి ఆర్ ఎస్ ఆడిటోరియం నందు విజేతలకు నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ గారు, జిల్లా పర్యాటక శాఖ అధికారి సునీల్ కన్నా గారు విజేతలకు
జ్ఞాపికతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేసి, విద్యార్థుల విజయాలను ప్రశంసించారు. జిల్లాస్థాయి వ్యాసరచన తెలుగు విభాగంలోలిఎల్ .లక్ష్మీ నందు ప్రథమ బహుమతి బి.లక్ష్మీ సౌమ్య బహుమతి ఇంగ్లీష్ విభాగంలో ఏం .జయలక్ష్మి ప్రథమ బహుమతి ఆర్ .మహా శ్రీ తృతీయ బహుమతి క్విజ్ నందు ప్రథమ దమస్థానం సాయి శ్రీ భవాని రిషిత అన్వితా రీల్స్ నందు పి సరయు ప్రథమ స్థానం పెయింటింగ్ నందు కే కార్తీక్ ప్రథమ స్థానం సి జగన్మోహన్ రెడ్డి తృతీయ స్థానం సాధించి అతిధుల చేత బహుమతులు అందుకున్నారు. విద్యార్థులు పర్యాటక రంగం యొక్క ప్రాముఖ్యత పర్యాటక నంద విశేషాలను ఏ విధంగా సందర్శించాలో చక్కగా వివరించినట్లుగా డైరెక్టర్ గారు తెలిపారు. విద్యార్థులను అన్ని అంశాల యందు మమేకం చేస్తున్నామంటకు మా విద్యార్థుల విజయాలు దీనికి తార్కానమని విద్యార్థులను మరియు విద్యార్థులకు చక్కని శిక్షణ అందించిన ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

నంద్యాలలో 36వ రాష్ట్రస్థాయి అనస్థీషియా వైద్యుల సదస్సు

వచ్చే సంవత్సరం సెప్టెంబర్ 24,25,26వ తేదీలలో . సదస్సు వేదిక: శాంతిరామ్ వైద్య కళాశాల

. సదస్సు ప్రథమ సమాచార బ్రోచర్ విడుదల చేసిన శాంతిరాం విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ మిద్దె శాంతి రాముడు

. నిర్వహణ: నంద్యాల అనస్థీషియా వైద్యుల సంఘం



నంద్యాల సెప్టెంబర్ 29(రిపబ్లిక్ న్యూస్) :
ఇండియన్ సొసైటీ ఆఫ్ అనస్థీషియాలాజిస్ట్స్, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో, నంద్యాల అనస్థీషియా వైద్యుల సంఘం నిర్వహణలో, శాంతిరాం వైద్య కళాశాలలో వచ్చే సంవత్సరం సెప్టెంబర్ 24,25,26, తేదీలలో నిర్వహించనున్న 36 వ రాష్ట్రస్థాయి అనస్థీషియా వైద్యుల సదస్సు ప్రథమ సమాచార బ్రోచర్ మంగళవారం శాంతిరాం వైద్య కళాశాలలో శాంతిరాం విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ మిద్దె శాంతి రాముడు ఆవిష్కరించారు. సదస్సు నిర్వాహక కమిటీ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన, నిర్వాహక కార్యదర్శి డాక్టర్ మధుసూదన రెడ్డి నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రథమ సమాచార బ్రోచర్ విడుదల చేసిన తదుపరి డాక్టర్ మిద్దె శాంతి రాముడు మాట్లాడుతూ నంద్యాల లో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు.అనస్థీషియా విభాగం వైద్య ఆరోగ్య రంగంలో అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్నదని ప్రశంసించారు. శాంతిరాం వైద్య కళాశాలలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించడానికి అవసరమైన వసతులు అన్నీ ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని ఇండియన్ సొసైటీ ఆఫ్ అనస్థీషియాలాజిస్ట్స్ నంద్యాల శాఖ ఘనంగా నిర్వహించి నంద్యాల వైద్య రంగానికి పేరు తీసుకురావాలని కోరారు. సదస్సు విజయవంతం కావడానికి కళాశాల తరఫున అన్ని రకాల సహకారం అందజేస్తామని తెలిపారు.
సదస్సు నిర్వాహక కమిటీ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ, నిర్వాహక కార్యదర్శి డాక్టర్ మధుసూదన రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సదస్సులో ప్రఖ్యాత రాష్ట్ర, జాతీయ,అంతర్జాతీయ అనస్థీషియా వైద్య నిపుణులు వైద్య వైజ్ఞానిక సదస్సులో పాల్గొని ప్రసంగిస్తారని, భారతీయ అనస్థీషియా వైద్యుల సంఘం జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు, రాష్ట్రం నలుమూలల నుండి 700 మంది అనస్థీషియా వైద్యులు ప్రతినిధులుగా పాల్గొంటారని తెలిపారు. సదస్సులో అనస్థీషియా రంగంలో వచ్చిన అత్యాధునిక విధానాలు, నూతన పరికరాల వినియోగం పై అనస్థీషియా వైద్యులకు నిరంతర వైద్య విద్య సదస్సులో భాగంగా అవగాహన పెంచడం జరుగుతుంది అన్నారు. తద్వారా ప్రజలకు ఆయా ప్రాంతాలలో మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఆస్కారం ఏర్పడుతుందని తెలిపారు. నంద్యాలలో మొట్టమొదటిసారిగా ఈ ప్రతిష్టాత్మక సదస్సు శాంతిరాం వైద్య కళాశాలలో నిర్వహించడానికి అవకాశం కల్పించిన చైర్మన్ డాక్టర్ మిద్దె శాంతి రాముడు కు ధన్యవాదాలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో శాంతిరాం వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వసంత చౌహాన్, శాంతిరాం వైద్య కళాశాల ఆసుపత్రి సూపరింటెండెంట్ మరియు నిర్వాహక కమిటీ కార్యదర్శి డాక్టర్ మధుసూదన రెడ్డి, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ శ్రీదేవి, నిర్వాహక కమిటీ కోశాధికారి డాక్టర్ నాగరాజా రెడ్డి,ఇండియన్ సొసైటీ ఆఫ్ అనస్థీషియాలాజిస్ట్స్ నంద్యాల శాఖ సంయుక్త కార్యదర్శి డాక్టర్ నాగరాజు, కార్యవర్గ సభ్యులు డాక్టర్ చెన్నకేశవ,డాక్టర్ రవితేజ, డాక్టర్ ఫణీంద్ర రెడ్డి పాల్గొన్నారు.

పరిశ్రమల అనుమతులను నిర్దిష్ట గడువులోగా మంజూరు చేయాలి.

..ఎం ఎస్ ఎం ఈ పార్కుల్లో మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలి.

..పారిశ్రామిక రంగంలో రాణించేందుకు ఆర్ఏఎంపి కార్యక్రమంపై విస్తృత అవగాహన కల్పించాలి.

..జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి.



కర్నూలు, సెప్టెంబర్ 29 (రిపబ్లిక్ న్యూస్) : జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేయడంతో పాటు ఎం ఎస్ ఎం ఈ లకు అవసరమైన మౌలిక వసతులు, సాంకేతిక సహకారం, ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందేలా సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు.
మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశంలో జిల్లాలో పరిశ్రమల పురోగతి, పరిశ్రమల అనుమతులు, ఎం ఎస్ ఎం ఈ పార్కులు, పారిశ్రామిక క్లస్టర్లు, ఆర్ఏఎంపి కార్యక్రమాల అమలుపై కలెక్టర్ సమీక్షించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో సింగల్ డిస్క్ పోర్టల్ ద్వారా 42 దరఖాస్తులు వచ్చాయని 24 అప్లికేషన్స్ అనుమతి పొందగా 18 అప్లికేషన్స్ వివిధ శాఖల వద్ద పెండింగ్‌లో ఉన్న పరిశ్రమల అనుమతులను శాఖల వారీగా గుర్తించి, ప్రతి దరఖాస్తుకు నిర్దిష్ట గడువు నిర్ణయించి సత్వరంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఏ స్థాయిలో దరఖాస్తు పెండింగ్‌లో ఉందో స్పష్టంగా గుర్తించి, జాప్యానికి కారణాలను పరిష్కరించాలని సూచించారు. ఎమ్మిగనూరు, ఆలూరు, కోడుమూరు తదితర ప్రాంతాల్లోని ఎం ఎస్ ఎం ఈ పార్కుల్లో రోడ్లు, విద్యుత్, నీరు వంటి మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రారంభం కాని పనులను వెంటనే ప్రారంభించి, జరుగుతున్న పనులకు నిర్దిష్ట పూర్తి గడువు నిర్ణయించాలని సూచించారు. మూడు నెలల గడువు ఉన్న పనులపై వారానికోసారి సమీక్ష నిర్వహించాలని తెలిపారు.

స్థానిక వనరుల ఆధారంగా పారిశ్రామిక క్లస్టర్ల అభివృద్ధి

జిల్లాలో స్థానిక వనరులు, సంప్రదాయ వృత్తులు, వ్యవసాయ ఉత్పత్తులు, ఇప్పటికే ఉన్న ఎంఎస్ఎమ్ఈ యూనిట్ల ఆధారంగా ఆంధ్రప్రదేశ్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద కొత్త పారిశ్రామిక క్లస్టర్లను గుర్తించి అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. హ్యాండ్‌లూమ్, పవర్‌లూమ్, కాటన్, ఫుడ్ ప్రాసెసింగ్, మిరప, టమాటా తదితర రంగాల్లో క్లస్టర్ల ఏర్పాటుకు అవకాశాలను గుర్తించి సమగ్ర ప్రతిపాదనలు రూపొందించాలని తెలిపారు. క్లస్టర్ల ఏర్పాటులో ఆసక్తి ఉన్న పారిశ్రామిక యూనిట్లు, వృత్తిదారులను గుర్తించి ఎస్ పి వి ఏర్పాటు, రిజిస్ట్రేషన్, డిపిఆర్ ల తయారీ, ఆన్‌లైన్ దరఖాస్తుల సమర్పణ తదితర ప్రక్రియలను నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
ఆర్ఏఎంపి కార్యక్రమాలపై విస్తృత అవగాహన కల్పించాలి.
ఆర్ఏఎంపి మరియు ఎం ఎస్ ఎం ఈ కార్యక్రమం కింద మీవీజులకు అందుబాటులో ఉన్న ప్రోత్సాహకాలు, సాంకేతిక, సంస్థాగత సహకారంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. యువత, స్టార్టప్‌లు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు స్వయం ఉపాధి, పరిశ్రమల స్థాపన, ప్రభుత్వ పథకాలు, ఆర్థిక సహాయంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. డిగ్రీ కళాశాలల చివరి సంవత్సరం విద్యార్థులకు కూడా పారిశ్రామిక అవకాశాలు, స్టార్టప్‌లు, ప్రభుత్వ ప్రోత్సాహకాలపై ప్రాక్టికల్ అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.
పరిశ్రమల అనుమతులు, ఎంఎస్ఎమ్ఈ పార్కులు, క్లస్టర్ అభివృద్ధి, ఆర్ఏఎంపి కార్యక్రమాల అమలుపై టైమ్‌లైన్ ఆధారిత మానిటరింగ్ చేపట్టి, వారానికోసారి పురోగతిని సమీక్షించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి జవహర్ బాబు, ఏ.పి.ఐ.ఐ.సి జోనల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి, నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారి దీప్తి, ఎల్.డి.ఏం మోహన్, మార్కెటింగ్ ఏ.డి నారాయణ మూర్తి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కిషోర్ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ అధికారి రాధిక, జిల్లా రవాణా శాఖ అధికారి శాంతి, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రతినిధి విజయ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో గుండె ఆరోగ్యంపై అవగాహన కల్పించిన లయన్స్ క్లబ్ ఆఫ్ నంద్యాల



నంద్యాల: సెప్టెంబర్ 29 (రిపబ్లిక్ న్యూస్) :
ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ నంద్యాల అధ్యక్షులు సందీప్ ఆధ్వర్యంలో శ్రీ గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్, నంద్యాలలో విద్యార్థులకు గుండె ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇండస్ హాస్పిటల్, నంద్యాల కార్డియాలజిస్ట్ లయన్ డాక్టర్ మురళి గారు, స్టార్ చిల్డ్రన్స్ హాస్పిటల్, నంద్యాల పీడియాట్రీషియన్ లయన్ డాక్టర్ కార్తికేయ గారు విద్యార్థులను ఉద్దేశించి గుండె ఆరోగ్యం, ఆరోగ్యకరమైన జీవనశైలి, మంచి ఆహారపు అలవాట్లు మరియు గుండె సంబంధిత సమస్యలపై అవగాహన కల్పించారు.విద్యార్థులు అడిగిన వివిధ ప్రశ్నలకు వైద్యులు సమాధానాలు ఇస్తూ, చిన్న వయస్సు నుంచే ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. వైద్యుల విలువైన సూచనలు, అవగాహన కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచాయి అలాగే కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు మరియు సర్టిఫికెట్స్ అందచేశారు.ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రాంగణాన్ని అందించి, కార్యక్రమ నిర్వహణకు సహకరించిన శ్రీ గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ పి. దస్తగిరి రెడ్డి గారు, డైరెక్టర్ పి. షావల్ రెడ్డి గారులకు లయన్స్ క్లబ్ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు."చిన్న వయస్సు నుంచే ఆరోగ్యకరమైన అలవాట్లు అలవరచుకోవడం ద్వారా భవిష్యత్తులో గుండె సంబంధిత సమస్యలను నివారించవచ్చు" అని కార్యక్రమంలో సందేశం ఇచ్చారు.ఈ కార్యక్రమం లో కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి సురేష్, జోన్ చైర్మన్ నాగరాజు,సభ్యులు కిరణ్ లాల్ తదితరులు పాలుగోన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com